


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




## పొగాకు రైతులకు భరోసా

'నో-బిడ్'లు తగ్గుముఖం

మంత్రి అచ్చెన్నాయుడు

- వివరాలు 6 లో..



# నాయకత్వానికి దిశ

- నేటి నుంచి రెండురోజులు లీడర్‌షిప్ కాంక్లేవ్
- పాల్గొననున్న అధినేత చంద్రబాబు, లోకేష్
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల దిశా నిర్దేశం
- పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాట్లు పూర్తి

2

మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నుంచి రెండురోజుల పాటు ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి ముఖ్యప్రతినిధులకు ట్రైనింగ్ కాంక్లేవ్ జరగనుంది. క్షేత్రస్థాయిలో టీడీపీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసే దిశగా, కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించేలా ట్రైనింగ్ ఇంటరాక్టివ్ విధానంలో లీడర్‌షిప్ కాంక్లేవ్ నిర్వహించాలని ఇప్పటికే పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశించారు. ఈ కాంక్లేవ్‌కు చంద్రబాబుతోపాటు లోకేష్ ఇద్దరూ హాజరుకానున్నారు. రెండురోజుల్లో వివిధ అంశాలపై దిశానిర్దేశం చేయనున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సహా ముఖ్య నేతలు హాజరుకానున్నారు.

# పేదల పండుగలో మరో అధ్యాయం

- నేటి నుంచే కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ
- ఎన్టీఆర్ భరోసాతో మరింత మందికి సామాజిక భద్రత
- స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

3

రాష్ట్రంలో ప్రతినెలా జరిగే పేదల పండుగను ప్రభుత్వం మరోస్థాయికి తీసుకువెళుతోంది. ఇప్పటికే దేశంలోనే అత్యధిక స్థాయిలో సామాజిక భద్రత పింఛన్లు అందిస్తూ 62 లక్షల మంది పేదలకు ప్రతి నెలా ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం అర్హత కలిగిన మరింత మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసేందుకు సిద్ధమైంది. సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తుల పరిశీలన నుంచి అర్హత నిర్ధారణ, ప్రభుత్వ ఆమోదం వరకు ప్రతి ప్రక్రియ ను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసి అర్హులైన వారికి దశల వారీగా పింఛన్లు మంజూరు చేయనున్నారు.





తిరుపతిలో లోకేష్‌కు

# ఘనస్వాగతం

2

తిరుపతి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న మంత్రి నారా లోకేష్‌ను ఆదివారం రాత్రి ఉమ్మడి చిత్తూరు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ ట్రస్ట్ సీవోవో అడుసుపల్లి గోపినాయుడు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిత్తూరులో ఇటీవల మరణించిన టీడీపీ సీనియర్ నేత చెరుకూరి వసంత్‌కుమార్ కుటుంబసభ్యు లను పరామర్శించారు.

# పర్యాటకంలో నాలుగు కొత్త గమ్యస్థానాలు

- ప్రభుత్వ ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం
- స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల్లో ప్రాజెక్టులు
- రూ.419.30 కోట్లతో ఆయా ప్రాంతాల అభివృద్ధి



4

ఏపీ పర్యాటక రంగంలో నాలుగు ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ.419.30 కోట్లతో అరకు, అరసవల్లి, గన్నవరం, వేదగిరి ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల పనులకు ప్రభుత్వం త్వరలో టెండర్లు కూడా పిలవనుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ.101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రూ.107.94 కోట్లతో 'అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, విజయవాడ విమానాశ్ర యానికి కిలోమీటర్ దూరంలో సుమారు పదెకరాల విస్తీర్ణంలో రూ.176 కోట్లతో 'గన్నవరం మైన్స్ సెంటర్' ఏర్పాటు చేయను న్నారు. నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రూ.34.29 కోట్లతో ప్రసాద్ పథకం అభివృద్ధి చేయనున్నారు.

నేడు స్వర్ణభారత్ ట్రస్ట్

# రజతోత్సవం

స్వర్ణభారత్ ట్రస్ట్

- హాజరుకానున్న యూపీ సీఎం యోగి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

నెల్లూరు జిల్లా వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవాలు సోమవారం జరగనున్నాయి. పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతోపాటు ముఖ్యఅతిథిగా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పాల్గొననున్నారు. 25 ఏళ్ల క్రితం 2001లో ఆవిర్భవించిన స్వర్ణభారత్ ట్రస్ట్ లక్షలాది మంది పేదలు, మహిళలు, రైతులు, గ్రామీణ యువత జీవితాల్లో వెలుగులు నింపింది.



## నెట్ జీరో క్యాంపస్‌లుగా అంబేద్కర్ గురుకులాలు

- సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయాలను ప్రోత్సహిస్తున్నాం
- పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి అధిక ప్రాధాన్యత
- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

7




## ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ

- డిజైన్, డీపీఆర్ పనులు ప్రారంభం
- సర్వే ప్రారంభించిన ఐఐటీ మద్రాస్
- ఐదుగురు సభ్యుల నిపుణుల బృందం రాక
- అధ్యయనం తర్వాత అలైన్‌మెంట్‌పై కసరత్తులు

6

# నాయకత్వానికి కొత్త దిశ

- నేటి నుంచే లీడర్‌షిప్ కాంక్లేవ్
- పాల్గొననున్న చంద్రబాబు, లోకేష్
- పార్టీ కేంద్ర కార్యాలయంలో రెండురోజుల శిక్షణ తరగతులు
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా ముఖ్య నేతలకు దిశానిర్దేశం



మంగళగిరి(చైతన్యరథం): ప్రజాప్రతి నిధులు, నియోజకవర్గ స్థాయి ముఖ్యప్రతినిధులకు నాయకత్వ పటిమ పెంపొందించే అంశంపై రెండురోజుల ట్రైనింగ్ కాంక్లేవ్‌ను టీడీపీ నిర్వహి స్తోంది. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమ, మంగళ వారాల్లో రెండురోజుల పాటు 10 సెషన్లలో ఈ కాంక్లేవ్ జరగనుంది. ట్రైనింగ్ – ఇంటరాక్టివ్ విధానంలో లీడర్‌షిప్ కాంక్లేవ్ నిర్వహించాలని ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో టీడీపీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేలా కాంక్లేవ్ నిర్వ హించేలా మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రణాళికలు రచించారు. ఈ కాంక్లేవ్‌కు చంద్రబాబు, లోకేష్ ఇద్దరూ హాజరుకానున్నారు. క్షేత్రస్థాయి యంత్రాంగం, కేడర్ సమన్వయం, పొలిటికల్ రెస్పాన్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్ వంటి అంశాల్లో నేతల సామర్థ్యాలను మెరుగుపరిచేలా రెండురోజుల పాటు ట్రైనింగ్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. రాజకీయాల్లో కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించేలా తెలుగుదేశం పార్టీ శ్రీకారం చుడుతోంది. ప్రభుత్వం – ప్రజలకు వారధిగా పార్టీ నేతలు ఉండాలని దిశానిర్దేశం చేయనున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ వంతమైన అమలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాల పై కాంక్లేవ్‌లో చంద్రబాబు అవగాహన కల్పించనున్నారు. ప్రభుత్వం – టీడీపీ చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రత్యర్థి పార్టీల కుట్రలను ఎండగట్టడం వంటి అంశాలపై కాంక్లేవ్‌లో కీలకంగా చర్చించనున్నారు. ఈ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సహా ముఖ్యనేతలు హాజరుకానున్నారు. మొదటిరోజున నాయకత్వ అభివృద్ధి, నాయకులను తీర్చిదిద్దడం, సరైన స్థానంలో నిలబెట్టడం – పార్టీ సంస్థాగత నిర్మాణం, అజెండా, పనితీరు, ప్రజా ఫిర్యాదుల పరి ష్కారం, స్వర్ణాంధ్ర విజన్, రాజకీయ, ఆర్థిక సాధికారత – సంపూర్ణ సంక్షేమం, సాధికారత అంశాలపై మార్గనిర్దేశం చేయనున్నారు. రెండోరోజున సుస్థిర అభివృద్ధి, ప్రజా సేవలు, సుపరి పాలన, పొలిటికల్ కమ్యూనికేషన్ – ప్రజలకు సేవల చేరువ, ఎల్‌నినోపై అవగాహన, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత అంశాలపై దిశానిర్దేశం చేయనున్నారు.





## తిరుపతి ఎయిర్‌పోర్టులో లోకేష్‌కు ఘనస్వాగతం

తిరుపతి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న మంత్రి నారా లోకేష్‌ను ఆదివారం రాత్రి ఉమ్మడి చిత్తూరు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కలిశారు. అనంతరం ఎన్టీఆర్ ట్రస్ట్ సీవోవో అడుసుపల్లి గోపినాయుడు, కుటుంబసభ్యులను పరామ ర్శించేందుకు లోకేష్ తిరుపతి జిల్లా పాకాల మండలం అడుసుపల్లి గ్రామానికి వెళ్లారు.











# పేదల పండుగకు మరో అధ్యాయం

- ఎన్టీఆర్ భరోసాతో మరింత మందికి సామాజిక భద్రత
- 62 లక్షల మందికి భరోసా.. కొత్త అర్హులకూ అవకాశం
- సెప్టెంబర్ 7-16 వరకు కొత్త పింఛన్ల దరఖాస్తులు
- స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ప్రతి నెలా జరిగే 'పేదల పండుగ'ను ప్రభుత్వం మరో స్థాయికి తీసుకువెళ్తోంది. ఇప్పటికే దేశంలోనే అత్యధిక స్థాయిలో సామాజిక భద్రత పింఛన్లు అందిస్తూ 62 లక్షల మంది పేదలకు ప్రతి నెలా ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు ఆ భరోసాను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. అర్హత కలిగిన మరింత మంది పేదలు, వృద్ధులు,వితంతువులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద తాజా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది.

సెప్టెంబర్ 7నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తుల పరిశీలన నుంచి అర్హత నిర్ధారణ, ప్రభుత్వ ఆమోదం వరకు ప్రతి ప్రక్రియను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసి, అర్హులైన వారికి దశలవారీగా పింఛన్లు మంజూరు చేయనున్నారు.

### కొత్త అర్హులకు మరో అవకాశం

అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాలతో ఇప్పటి వరకు పింఛన్ పొందని వారికి మరో అవకాశం కల్పిస్తోంది. సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారు. అర్హులైన వారు తమకు సంబంధించిన స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తు స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిన తరువాత నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం అర్హతను పరిశీలిస్తారు.

### జాప్యానికి తావులేకుండా కాలపట్టిక

కొత్త పింఛన్ దరఖాస్తుల ప్రక్రియలో పారదర్శకతతో పాటు వేగానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. ప్రతి దశకు స్పష్టమైన గడువు నిర్ణయించింది.

***సెప్టెంబర్ 7-16:*** దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ధృవీకరణ.

***సెప్టెంబర్ 17-21:*** సాధారణ అర్హత పరిశీలన.

***సెప్టెంబర్ 22-24:*** భౌతిక, శాఖాపరమైన ధృవీకరణ, అర్హత నిర్ణయం, సిఫారసు.

***సెప్టెంబర్ 25-26:*** సెర్ప్ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోద ప్రక్రియ.

అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తయిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా పింఛన్లు మంజూరు చేస్తారు. రాష్ట్రంలోని అన్ని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ దరఖాస్తు సేవ అందుబాటులో ఉంటుంది. నిర్ణీత నమూనాలోని దరఖాస్తు ఫారాలను ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతారు. అర్హులు దరఖాస్తును పూర్తి చేసి, అవసరమైన ధృవపత్రాలతో సంబంధిత స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కేంద్రంలో సమర్పించాలి. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం సిస్టమ్ జనరేటెడ్ అక్నాలెడ్జ్‌మెంట్ అందజేస్తారు.

### పింఛన్ అంటే పేదలకు పండుగ..

పేదల సేవలో పింఛన్ల పండుగను మరింత విస్తరిస్తున్న ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ఒక పండుగ వాతావరణాన్ని తీసుకువస్తోంది. వృద్ధులకు ఆత్మగౌరవం, వితంతువులకు ఆర్థిక భరోసా, దివ్యాంగులకు అండ, నిరుపేద కుటుంబాలకు జీవనాధారంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం నిలుస్తోంది. పింఛన్ అందుకుంటున్న వారి సంఖ్యను మాత్రమే పెంచడం కాకుండా, అర్హత ఉన్న ప్రతి పేదవాడికి సామాజిక భద్రత అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటివరకు పింఛన్ పరిధిలోకి రాని అర్హులను గుర్తించి వారికి కూడా ఈ భరోసాను అందించేందుకు తాజా దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించడం ఆ దిశలో మరో కీలక ముందడుగు.

### అవసరమైన ధృవపత్రాలు

అన్ని కేటగిరీలకు సాధారణంగా ఆధార్ కార్డు, రైస్ కార్డు లేదా ఆదాయ ధృవపత్రంతోపాటు సంబంధిత కేటగిరీకి అవసరమైన ప్రత్యేక ధృవపత్రాలను సమర్పించాలి.

***వృద్ధాప్య పింఛన్:*** వయస్సు నిర్ధారణకు ఆధార్.

***వితంతు పింఛన్:*** భర్త మరణ ధృవపత్రం, భర్త ఆధార్ నంబర్.

***ఒంటరి మహిళ:*** వివాహిత అయితే కోర్టు/అదాలత్ విడాకుల డిక్రీ; అవివాహిత అయితే తహసీల్దార్ జారీ చేసే వివాహం కాని ధృవపత్రం.

***దివ్యాంగుల పింఛన్:*** 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ బెంచ్‌మార్క్ దివ్యాంగత్వాన్ని నిర్ధారించే సదరం ధృవపత్రం.

***చేనేత కార్మికులు:*** చేనేత మరియు జౌళి శాఖ ధృవపత్రం.

***మత్స్యకారులు:*** మత్స్య శాఖ ధృవపత్రం.

***డప్పు కళాకారులు:*** సాంఘిక సంక్షేమ శాఖ ధృవపత్రం.

***సంప్రదాయ చెప్పుల తయారీదారులు:*** సాంఘిక సంక్షేమ శాఖ ధృవపత్రం.

***కల్లుగీత కార్మికులు:*** నిషేధ మరియు ఎక్సైజ్ శాఖ ధృవపత్రం.

***ట్రాన్స్‌జెండర్ లబ్ధిదారులు:*** జిల్లా వైద్య మండలి ధృవపత్రం.

### దేశంలోనే అత్యున్నత సామాజిక భద్రత

ప్రస్తుతం రాష్ట్రంలో 61,92,396 మంది పింఛనుదారులకు నెలకు రూ.2,694 కోట్ల మేర పింఛన్లు అందిస్తున్నారు. రాష్ట్ర జనాభాలో సుమారు 12.88 శాతం మంది సామాజిక భద్రత పింఛన్ల ప్రయోజనం పొందుతున్నారు. పింఛన్ మొత్తం, పింఛనుదారుల సంఖ్య, నెలవారీ వ్యయం, పింఛన్ల కోసం కేటాయిస్తున్న వార్షిక నిధుల పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యున్నత స్థానంలో ఉంది. ఇది కేవలం గణాంకాల్లో కనిపించే రికార్డు మాత్రమే కాదు... కోట్లాది పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న నిరంతర ఆర్థిక భరోసాకు నిదర్శనం.

### రూ.73,508 కోట్లతో చిత్తశుద్ధికి నిదర్శనం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. ఎన్నికల హామీ మేరకు పింఛన్ మొత్తాల పెంపును అమలు చేసింది. ప్రస్తుతం వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలు వర్గాలకు రూ.10,000, పూర్తిస్థాయి దివ్యాంగులకు రూ.15,000 వరకు పింఛన్లు అందుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సెప్టెంబర్ 1, 2026 వరకు రూ.73,508 కోట్లను కేవలం పింఛన్ల కోసమే వ్యయం చేసింది. పేదల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో ఈ ఒక్క గణాంకమే తెలియజేస్తోంది.

### అన్నివర్గాలకు అండ

ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కేవలం వృద్ధాప్య పింఛన్‌కు మాత్రమే పరిమితం కాలేదు. సమాజంలోని వివిధ వర్గాల ప్రత్యేక అవసరాలను గుర్తించి ప్రభుత్వం దాదాపు 28 రకాల కేటగిరీలలో పింఛన్లు అందిస్తోంది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులతో పాటు చేనేత కార్మికులు, మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులు, ట్రాన్స్‌జెండర్లు, వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కూడా పింఛన్ల ద్వారా సామాజిక భద్రత కల్పిస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీన రాష్ట్రవ్యాప్తంగా జరిగే పింఛన్ల పంపిణీని ప్రభుత్వం ఇప్పటికే పేదల పండుగగా మార్చింది. ఇప్పుడు కొత్త అర్హులను కూడా ఈ సామాజిక భద్రత పరిధిలోకి తీసుకురావడం ద్వారా ఆ పండుగను మరింత విస్తరించి మరోసారి సంక్షేమ ప్రభుత్వంగా నిరూపించుకుంది.

---

# 42వ రోజు విజయవంతంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'

- 1.04 కోట్ల ఇళ్లకు చేరుకున్న కార్యక్రమం
- నేడు 1,54,454 ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు

మంగళగిరి (చైతన్య రథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత దగ్గరగా చేర్చడం, ప్రభుత్వ పనితీరుపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకోవడం లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం -2 ఏళ్ల నమ్మకం -అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 42వ రోజు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది. నేడు రాష్ట్రవ్యాప్తంగా 1,54,454 ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటి వరకు మొత్తం 1.04 కోట్ల ఇళ్లు సందర్శించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రతి కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలుస్తూ, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తున్నారు. రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు అందుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలియజేస్తున్నారు. అదే సమయంలో ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా సేకరించి పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా, ప్రజా భాగస్వామ్యంతో విస్తృతంగా కొనసాగుతోంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజలు కూడా పెద్ద ఎత్తున భాగస్వామ్యం వహిస్తున్నారు.









## వసంత్ కుటుంబానికి లోకేష్ పరామర్శ

పెద్దకాల్వ(చైతన్యరథం): చిత్తూరులో ఇటీవల మరణించిన టీడీపీ సీనియర్ నేత చెరుకూరి వసంత్‌కుమార్ కుటుంబాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. ఆదివారం చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలం పెద్దకాల్వ గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. వసంత్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీకి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. లోకేష్ వెంట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిలారు రాజేష్, ఎమ్మెల్యే లు అమర్‌నాథ్‌రెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, మురళీ మోహన్, గురజాల జగన్మోహన్, వీఎమ్ థామస్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి ఉన్నారు.





# పర్యాటకంలో నాలుగు కొత్త గమ్యస్థానాలు

- **ప్రభుత్వ ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం**
- **స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల్లో ప్రాజెక్టులు**
- **రూ.419.30 కోట్లతో ఆయా ప్రాంతాల అభివృద్ధి**










అమరావతి(చైతన్యరథం): ఏపీ పర్యాటక రంగంలో నాలుగు ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ.419.30 కోట్లతో అరకు, అరసవల్లి, గన్నవరం, వేదగిరి ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజె క్టుల పనులకు ప్రభుత్వం త్వరలో టెండర్లు కూడా పిలవనుంది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ.152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీర్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్ధిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కొత్తగా ఆమోదం తెలిపిన నాలుగు ప్రాజెక్టులే కాకుం డా స్వదేశ్ దర్శన్ 2.0లో మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. మచిలీ పట్నంలో కోస్టల్ ఎక్స్‌పీరియన్స్, మంగళగిరి ఆలయ పరిసరాల్లో పర్యాటక సదుపాయాలు, మంగళగిరి ఎదో పార్క్ అభివృద్ధి, నంద్యాల జిల్లాలో బెలూం గుహల్లో కేవ్ లైటింగ్ సందర్శకులకు సదుపాయాల కల్పన వంటివి వీటిలో ఉన్నాయి. కొత్తగా కేంద్రం ఆమోదం తెలిపిన ప్రాజెక్టుల వివరాలు ఇలా ఉన్నాయి.

### అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ.101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. కొత్తవలసలో ఐటీడీఏకు చెందిన 19.23 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. గిరిజన సంస్కృతి, స్థానిక వంటకాలు, అరకు కాఫీ, చిరుధాన్యాల ప్రత్యేకతలను పర్యాటకు లకు పరిచయం చేయనున్నారు.

### అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.107.94 కోట్లతో 'అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నాగావళి నది ఒడ్డున ఉన్న చారిత్రక డచ్ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకు రానున్నారు. డిజిటల్ ప్రదర్శనలు, మ్యూజియం, హస్తకళల అనుభవాలు, తదితర సదుపాయాలతో నాగావళి రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేస్తారు.

### రూ.176 కోట్లతో గన్నవరం మైస్ సెంటర్

విజయవాడ విమానాశ్రయానికి కిలోమీటర్ దూరంలో సుమారు పదెకరాల విస్తీర్ణంలో రూ.176 కోట్లతో 'గన్నవరం మైస్ సెంటర్' ఏర్పాటు చేయను న్నారు.. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను పరిచయం చేసే ఇమ్మర్సన్ థియేటర్, ప్రసిద్ధ స్వీట్లు, జ్ఞాపికల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయను న్నారు.

### నెల్లూరులో వేదగిరి లక్ష్మీనరసింహ ఆలయ అభివృద్ధి

నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆల యాన్ని రూ.34.29కోట్లతో ప్రసాద్ పథకం అభివృద్ధి చేయనున్నారు. పెరుగుతున్న భక్తులరద్దీకి అనుగుణం గా రాకపోకలు, క్యూల నిర్వహణ,వేది ఉండే ప్రాంతా ల్లో భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచనున్నారు. టూరిస్ట్ ఆమెనిటీ సెంటర్, వెయిటింగ్ హాళ్లు, కొత్త అన్నదాన భవనం, వంటశాల, ప్రవేశ ద్వారం, నడక మార్గాలు, ల్యాండ్ స్కేపింగ్, భక్తుల పార్క్ కూర్చునే ప్రవేశాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించనున్నారు.





# ఎన్టీఆర్ ట్రస్ట్ సీవోవోకి లోకేష్ పరామర్శ

పాకాల(చైతన్యరథం): ఎన్టీఆర్ ట్రస్ట్ సీవోవో (చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్) అడుసుపల్లి గోపినాయుడు, కుటుంబసభ్యులను మంత్రి నారా లోకేష్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల గోపి నాయుడు తండ్రి ఆంజనేయులు నాయుడు స్వర్గస్థులయ్యారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా పాకాల మండలం అడుసుపల్లి గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు నాయుడు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. లోకేష్ వెంట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిలారు రాజేష్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, మురళీమోహన్, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు షణ్ముగం రెడ్డి తదితరులు ఉన్నారు.













# పొగాకు రైతులకు భరోసా..

## మార్కెట్‌లో మెరుగైన పరిస్థితులు

- ‘నో-బిడ్’లు తగ్గుముఖం.. కొనుగోలుదారుల పోటీతో మెరుగవుతున్న ధరలు
- వచ్చే ఏడాది పంట నియంత్రణతో మార్కెట్‌కు అనుగుణంగా ఉత్పత్తి
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా చర్యలు
- వేలం కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం: మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 ఎఫ్‌సీవీ పొగాకు వేలాల్లో ఇటీవల మార్కెట్ పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలు, మార్గదర్శకత్వంతో పొగాకు రైతులకు మెరుగైన మార్కెట్, గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. తాను కూడా పొగాకు వేలం ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 4 నాటికి 132 వేలం రోజుల్లో 86.59 మిలియన్ కిలోల ఎఫ్‌సీవీ పొగాకు మార్కెట్ అయిందని మంత్రి తెలిపారు. ప్రస్తుత సీజన్‌కు అనుమతించబడిన పంట పరిమాణం 142 మిలియన్ కిలోలు కాగా, అంచనా ఉత్పత్తి సుమారు 236 మిలియన్ కిలోలుగా ఉందన్నారు. ఇప్పటివరకు నమోదైన సగటు ధర కిలోకు రూ.209.83గా ఉందని వెల్లడించారు. గత ఏడాది ఇదే 132 వేలం రోజుల నాటికి 140.27 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్ కాగా, తుది సగటు ధర కిలోకు రూ.248.86గా నమోదైందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది అధిక ఉత్పత్తి కారణంగా మార్కెట్‌లో సర్ప్లస్ ఏర్పడటంతో కొంత ఒత్తిడి నెలకొన్నప్పటికీ, ఇటీవల వేలాల్లో కొనుగోలుదారుల స్పందన, పోటీ గణనీయంగా మెరుగుపడుతున్నాయని తెలిపారు.

### తగ్గుతున్న ‘నో-బిడ్’లు.. పెరుగుతున్న కొనుగోలుదారుల పోటీ

ఇటీవల వేలం కేంద్రాల్లో ‘నో-బిడ్’ బేల్స్ శాతం గణనీయంగా తగ్గిందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రస్తుతం రోజువారీగా సగటున 11-12 శాతం వరకు ‘నో-బిడ్’లు నమోదవుతున్నాయని, కొన్ని వేలం ప్లాట్‌ఫారమ్‌లలో ఇది 1-2 శాతం కంటే కూడా తక్కువగా ఉందన్నారు. ‘నో-బిడ్’లు తగ్గడం, కొనుగోలు కార్యకలాపాలు పెరగడం, కొనుగోలుదారుల మధ్య పోటీ మెరుగుపడటం మార్కెట్‌లో సానుకూల సంకేతాలని మంత్రి అన్నారు. ప్రస్తుతం వారానికి సుమారు 10 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్ అవుతోందని తెలిపారు. కొనుగోలుదారుల మధ్య పెరుగుతున్న పోటీ మెరుగైన ధరల సాధనకు దోహదపడుతోందన్నారు.

### కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ధరలు

వివిధ వేలం ప్రాంతాల్లో కూడా మార్కెట్



పరిస్థితులు మెరుగుపడుతున్నాయని మంత్రి తెలిపారు. సీహెచ్ఎల్ఎస్ ప్రాంతంలో అత్యధికంగా కిలోకు రూ.329 వరకు ధర లభించిందన్నారు. ఎస్ఎల్ఎస్‌లో అత్యధిక బిడ్ రూ.255, ఎస్‌జీఎస్‌లో రూ.252గా నమోదైందని వెల్లడించారు. డిమాండ్ ఉన్న గ్రేడ్లు, రకాల పొగాకుకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి స్పందన లభిస్తోందన్నారు. గత నెల రోజులుగా ఎస్ఎల్ఎస్, ఎస్‌జీఎస్ ప్రాంతాల్లో కొనుగోలు వేగం, ధరల సాధన వేలం ప్రారంభ దశతో పోలిస్తే మెరుగుపడ్డాయని చెప్పారు.

### రైతుల ప్రయోజనాల కోసం నిరంతర పర్యవేక్షణ

పొగాకు పంట మార్కెటింగ్ ప్రక్రియను టొబాకో బోర్డు ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు, తయారీదారులు, ఎగుమతిదారులు, వ్యాపార ప్రతినిధులతో సమన్వయం చేస్తూ కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామన్నారు. వేలాల్లో కొనుగోలుదారులు నిరంతరం పాల్గొనేలా చూడటం, మార్కెటబుల్ పొగాకును కొనుగోలు చేయడం, నివారించగల ‘నో-బిడ్’లను తగ్గించడం, కొనుగోలు షెడ్యూల్‌ను క్రమబద్ధంగా కొనసాగించడం, పంటను త్వరితగతిన మార్కెట్ చేయడం వంటి అంశాలపై వ్యాపార వర్గాలతో చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వ్యాపార వర్గాల ప్రతినిధులతో మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేశామని, సీనియర్ అధికారులు వేలం ప్లాట్‌ఫారమ్‌లను సందర్శిస్తూ క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని మంత్రి వివరించారు.

### వచ్చే ఏడాది పంట పరిమాణం భారీగా తగ్గింపు

ప్రస్తుత సీజన్‌లో అనుమతించబడిన పంట పరిమాణం, వాస్తవ ఉత్పత్తి మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడటంతో మార్కెట్‌లో అధిక పరిమాణంలో పొగాకు అందుబాటులోకి వచ్చిందని అచ్చెన్నాయుడు తెలిపారు. దీనివల్ల మార్కెట్‌పై ఒత్తిడి ఏర్పడిందన్నారు. ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని 2026-27 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌లో ఎఫ్‌సీవీ పొగాకు అనుమతించబడిన పంట పరిమాణాన్ని 142 మిలియన్ కిలోల నుంచి 81 మిలియన్ కిలోలకు తగ్గించినట్లు మంత్రి తెలిపారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిని నియంత్రించడం, భవిష్యత్తులో అధిక మార్కెటబుల్ సర్ప్లస్ ఏర్పడకుండా చూడటం ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమన్నారు. వచ్చే ఏడాది రైతులు అనుమతించబడిన పంట పరిమాణానికి మాత్రమే పరిమితమై సాగు చేసేలా టొబాకో బోర్డు ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆయన మార్గదర్శకత్వంలో పొగాకు రైతులకు మెరుగైన మార్కెట్, న్యాయమైన ధరలు అందేలా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. వేలం ప్రక్రియ పూర్తయ్యే వరకు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ

- డిజైన్, డీపీఆర్ పనులు ప్రారంభం
- డిప్యూటీ సీఎం ప్రత్యేక పర్యవేక్షణలో సర్వే ప్రారంభించిన ఐఐటీ మద్రాస్
- తీర ప్రాంతం వెంబడి ఐదుగురు సభ్యుల నిపుణుల బృందం డ్రోన్ సర్వే
- అత్యాధునిక సాంకేతికతతో బీచ్ ప్రొఫైల్, తీరాల మ్యాపింగ్ చేస్తున్న బృందం
- తీరం వెంబడి ఇసుక, మట్టి అవశేషాల నమూనాల సేకరణ, పరీక్షలు
- అధ్యయనం పూర్తైన అనంతరం రక్షణ గోడ అలైన్‌మెంట్‌పై కసరత్తులు
- సమాంతరంగా పర్యావరణ అనుమతుల ప్రక్రియ పూర్తి చేయాలన్న పవన్ కళ్యాణ్



పిఠాపురం (చైతన్య రథం): పిఠాపురం నియోజక వర్గంలోని ఉప్పాడ తీర ప్రాంతవాసుల దశాబ్దాల కల సాకారం దిశగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం దిశగా కీలక అడుగులు ప్రారంభమయ్యాయి. రక్షణ గోడ నిర్మాణానికి సాంకేతిక సహకారం అందించేందుకు ఒప్పందం చేసుకున్న ఐఐటీ-మద్రాస్ పనిని ప్రారంభించింది. రూ.323 కోట్ల నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్‌తో నిర్మితమవుతున్న రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి డిజైన్, డీపీఆర్ రూపకల్పన కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఐఐటీ మద్రాస్ ప్రతినిధి బృందం అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో సముద్ర గర్భంలోనూ, తీర ప్రాంతం వెంబడి సర్వే చేపట్టింది. తీర ప్రాంత ఇంజినీరింగ్, సముద్ర పరిశోధనల్లో విశేష అనుభవం కలిగిన ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందం గత వారం రోజులుగా ఉప్పాడ తీర ప్రాంతంలో క్షేత్రస్థాయి సర్వేలు చేపట్టింది.

అధునాతన డ్రోన్లతోపాటు బీచ్ ప్రొఫైలింగ్, తీర ప్రాంతాల మ్యాపింగ్ కోసం ట్రింబుల్ ఆర్980 జీఎన్ఎస్ఎస్ ఆర్‌టీకే సాంకేతికతను వినియోగిస్తున్నారు. తీర ప్రాంత భౌగోళిక పరిస్థితులు, సముద్ర అలల ప్రభావం, తీర కోత తీవ్రత, భూభాగ మార్పులు, సముద్ర ప్రవాహాల దిశలు వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. నీటి అడుగు భాగంనుంచి బీచ్ వరకు ఇసుక కణాల సేకరణ, సమగ్ర అధ్యయనం సాగుతోంది. వీటితోపాటు ఉప్పాడ తీర ప్రాంతం వెంబడి ఇసుక, మట్టి అవశేషాల నమూనాలు సేకరించి, శాస్త్రీయ అధ్యయన ప్రక్రియ కొనసాగిస్తున్నారు. బాతిమెట్రిక్ సర్వే ద్వారా సముద్రపు లోతు, సీ బెడ్ స్థాయిలు, వాటి మార్పులను గుర్తిస్తున్నారు. బీచ్ ఆకృతి, వాలు, ఎత్తుపై అధ్యయనం కొనసాగుతోంది. షోర్‌లైన్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. తీర ప్రాంత కోతను అంచనా వేయడంలో ఈ అధ్యయనం కీలక పాత్ర పోషిస్తుంది.

ఉప్పాడ సముద్ర తీరం వెంబడి ప్రతిపాదిత రక్షణ గోడ నిర్మాణానికి అనువైన అలైన్‌మెంట్‌ను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. భవిష్యత్తులో సముద్ర కోత ప్రభావాన్ని సమర్థవంతంగా, సుదీర్ఘకాలం ఎదుర్కొనే విధంగా డిజైన్ రూపకల్పనకు ఈ సర్వే ఉపయోగపడుతుంది. ఈ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఐఐటీ మద్రాస్ ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి డిజైన్, డీపీఆర్ తదితర సాంకేతిక అంశాలపై దృష్టి సారించనుంది.

గత నాలుగు దశాబ్దాలుగా ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు సముద్ర కోత సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే వందల ఎకరాలు, పలు గ్రామాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. ఎంతో మంది నిర్వాసితులు కాగా, రైతులు వందల ఎకరాల పంట భూములను సైతం కోల్పోయారు.

ఈ సమస్య పరిష్కారానికి నడుం బిగించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, సముద్ర కోత సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో చర్యలు చేపట్టారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రతిపాదన మేరకు సీ ప్రొటెక్షన్ వాల్, గ్రోయిన్ ఫీల్డ్, హోప్ ఐలాండ్ పరిసరాల్లో ప్రకృతి ఆధారిత తీర రక్షణ చర్యలు చేపట్టేందుకు ఆమోదం లభించింది. అందుకు అనుగుణంగా డీపీఆర్ రూపకల్పన పనులు ప్రారంభమయ్యాయి. పవన్ కళ్యాణ్ ఈ పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పిఠాపురం పర్యటన సందర్భంగా డిజైన్, డీపీఆర్‌పై ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందంతో చర్చించనున్నారు.

నిర్ణీత గడువులోపు నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా డిజైన్, డీపీఆర్ రూపకల్పన సమాంతరంగా పర్యావరణ తదితర అనుమతుల ప్రక్రియ పూర్తి చేసి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని ఆదేశించారు.



చైతన్యరథం

# రైతులకు రాజముద్రతో పాసుపుస్తకాలు

- నాడు జగన్ బొమ్మలతో పబ్లిసిటీ చేసుకున్నాడు
- రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం
- అన్నదాత సుఖీభవతో ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం
- ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించాలి
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వెల్లడి
- పాకలలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ



సింగరాయకొండ, జరుగుమల్లి (చైతన్య రథం): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం జరుగుమల్లి మరియు సింగరాయకొండ మండలం పాకలలో నిర్వహించిన "మీ భూమి – మీ హక్కు" కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలను ఆయన స్వయంగా పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వే తప్పుల తడకగా మారిందని, సరిహద్దుల వివాదాలతో అనేకమంది లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. రీ సర్వే పొలాలకు సంబంధించి తమ భూములకు తప్పుగా హద్దులు పడ్డాయని ప్రజలు తెచ్చిన ఫిర్యాదులపై మంత్రి తక్షణమే స్పందిస్తూ, గతంలో జరిగిన పొరపాట్లన్నింటినీ సరిదిద్ది లబ్ధిదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఎలాంటి తప్పులకు తావులేకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేశామని, 2027 మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా రీ సర్వేను పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి గారు ఉన్నారని స్పష్టం చేశారు. రైతుల సౌకర్యార్థం ప్రతి నెలా 9వ తేదీలోపు అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పాసుపుస్తకాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు.

పాసుపుస్తకాల పంపిణీకి సంబంధించిన ఖచ్చితమైన గణాంకాలను మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా మొత్తం 516 గ్రామాలు ఉండగా, అందులో 19 గ్రామాలు ముంపు మరియు పట్టణ ప్రాంత పరిధిలోకి వస్తాయని, మిగిలిన 497 గ్రామాలు రీ సర్వేకు అనుకూలంగా ఉన్నాయని వివరించారు. ఇప్పటికే జిల్లాలో 287 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని, మిగిలిన 210 గ్రామాల్లో సర్వే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గత ఆగస్టు మాసం నాటికి జిల్లా వ్యాప్తంగా 201 గ్రామాల్లో మొత్తం 94,676 పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన 294 గ్రామాలకు సంబంధించి 3,03,558 పాసుపుస్తకాలను అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, సెప్టెంబరు 2026 నాటికి 23 గ్రామాల్లో 13,356 పుస్తకాలు, అక్టోబరులో 49 గ్రామాల్లో 37,894, నవంబరులో 43 గ్రామాల్లో 35,174, డిసెంబరులో 46 గ్రామాల్లో 52,660, జనవరి 2027 నాటికి 43 గ్రామాల్లో 52,624, ఫిబ్రవరిలో 47 గ్రామాల్లో 58,823 మరియు మార్చి 2027 నాటికి మిగిలిన 43 గ్రామాల్లో 51,107 పాసుపుస్తకాలను అందజేసి రీ సర్వే ప్రక్రియను సంపూర్ణంగా పూర్తి చేస్తామని వివరించారు.

అలాగే కొండపి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఆగస్టు మాసం నాటికి మొత్తం 18,020 పాసుపుస్తకాలను అందించినట్లు తెలిపారు. ఇందులో కొండేపి మండలంలో 2,999, మర్రిపూడిలో 831, పొన్నలూరులో 2,049, సింగరాయకొండలో 2,329, టంగుటూరులో 5,645, మరియు జరుగుమల్లి మండలంలో 4,167 పాసుపుస్తకాలు పంపిణీ అయ్యాయని తెలిపారు. ఇక జరుగుమల్లి మండల పరిధిలోని తుమాడు (392), చిరికూరపాడు (606), కామేపల్లి అగ్రహారం (120), పి.ఎమ్.కండ్రిక (46), ఎన్.ఎమ్.వి.కండ్రిక (59), నందనవనం (764), పి.జి.కండ్రిక (148), ఎడ్లూరుపాడు (694), పైడిపాడు (252), పాలేటిపాడు (879), పి.ఎమ్.వి.కండ్రిక (139), ఐఎమ్‌వి కండ్రిక (68), జరుగుమల్లి (854), మరియు జె.జి.కండ్రిక (93) గ్రామాలలో కలిపి మొత్తం 5,114 పాసుపుస్తకాలను లబ్ధిదారులకు అందించినట్లు వెల్లడించారు.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై మాట్లాడుతూ, గతంలో పాలకులు హద్దురాళ్లు మరియు పాసుపుస్తకాలపై తమ సొంత ఫోటోలు వేసుకుని ప్రచారం చేసుకున్నారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం అధికారిక రాజముద్రతో కూడిన భద్రమైన పాసుపుస్తకాలను ప్రజలకు అందిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో భూ హద్దులను ఎవరూ అక్రమంగా మార్చడానికి వీలులేకుండా బ్లాక్‌చైన్ టెక్నాలజీని వినియోగిస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా, పాసుపుస్తకాలలో ఏర్పాటు చేసిన అత్యాధునిక క్యూ-కోడ్ టెక్నాలజీ ద్వారా ఒక స్కాన్ చేస్తే లబ్ధిదారుల వివరాలు, మరొక స్కాన్ చేస్తే భూమి యొక్క ఖచ్చితమైన లొకేషన్ తెలిసేలా ఏర్పాట్లు చేశామని వివరించారు.

దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారంపై స్పందిస్తూ, గర్భ కండ్రిక భూముల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి దాదాపు 4,000 ఎకరాలకు విముక్తి కలిగించిందని మంత్రి తెలిపారు. అదేవిధంగా చుక్కల భూములు, గయాలు, జాయింట్ ఎల్‌పీవీల వంటి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, త్వరలోనే వీటన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం, రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసిందని గర్వంగా ప్రకటించారు. పాలేరు రిజర్వాయర్‌కు 0.6 టీఎంసీల నీటిని కేటాయించడమే కాకుండా, 123 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సంగమేశ్వరం ప్రాజెక్టును మంజూరు చేశామని, త్వరలోనే దీనికి సంబంధించిన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

రాష్ట్రంలో సంక్షేమ రంగానికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తున్నామని తెలుపుతూ, అన్ని రకాల పింఛన్ల పెంపుతో పాటు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, అన్నా క్యాంటీన్లు, స్త్రీ శక్తి, దివ్యాంగ శక్తి వంటి పథకాల ద్వారా సమాజంలో ప్రతి వర్గానికి సంక్షేమ ఫలాలను తక్షణమే అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అధ్వానంగా ఉన్న రోడ్ల పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. డిజిటల్ పాలనలో భాగంగా 'మన మిత్ర' యాప్ ద్వారా 100కు పైగా ప్రభుత్వ ధృవీకరణ పత్రాలను పారదర్శకంగా అందిస్తున్నామని, అలాగే 'డిజిలాకర్' ద్వారా లభించే సేవలపై ప్రజలందరూ అవగాహన పెంచుకుని వినియోగించుకోవాలని మంత్రి కోరారు.

## పిడుగుపాటుకు రైతు మృతి

### విచారం వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం పవన్

పిఠాపురం (చైతన్య రథం): పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని యు.కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లి గ్రామంలో పిడుగుపాటుకు రైతు పి.నూకరాజు మృతి చెందిన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఆదివారం సాయంత్రం నూకరాజు తన కుమారుడితో కలిసి పొలం పనుల్లో ఉండగా పిడుగుపాటుకు గురైనట్లు, ఘటనలో నూకరాజు అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన కుమారుడు తీవ్రంగా గాయపడినట్టు కలెక్టర్ తెలిపారు. మృతుడి కుటుంబానికి తక్షణమే ప్రభుత్వం నుంచి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని, గాయపడిన కుమారుడికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. నూకరాజు కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వర్షాలు కురిసే సమయంలో పొలం పనుల్లో ఉన్న రైతులు, అలాగే బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ప్రజలు తక్షణం సురక్షిత ప్రాంతాలను ఆశ్రయించే విధంగా అవగాహన కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## నెట్ జీరో క్యాంపస్‌లుగా అంబేద్కర్ గురుకులాలు

- సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయాలను ప్రోత్సహిస్తున్నాం
- పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి అధిక ప్రాధాన్యత
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- అంబేద్కర్ గురుకులంలో మొక్కలు నాటిన మంత్రి

సింగరాయకొండ (చైతన్య రథం): ప్రభుత్వ సంక్షేమ విద్యాసంస్థలను నిత్యం పచ్చదనంతో శోభిల్లేలా చేస్తూ, విద్యార్థులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన మరియు పర్యావరణహితమైన వాతావరణాన్ని అందించడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఆదివారం సింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో "నెట్ జీరో హెల్త్ క్యాంపస్" కార్యక్రమంలో భాగంగా చేపట్టిన "అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ (అనంత అరణ్య మోడల్)" కార్యక్రమాన్ని మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ.. "పాఠశాలలు కేవలం చదువు చెప్పే కేంద్రాలుగానే కాకుండా, విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడే పచ్చని నిలయాలుగా మారాలన్నారు.. 'నెట్ జీరో హెల్త్ క్యాంపస్' విధానం ద్వారా ప్రతి గురుకులాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అతి తక్కువ స్థలంలో, తక్కువ సమయంలోనే దట్టమైన అడవిని తలపించేలా రూపుదిద్దుకునే 'అనంత అరణ్య మోడల్ (అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్)' ద్వారా క్యాంపస్‌లో ఆక్సిజన్ స్థాయిలు పెరిగి విద్యార్థులకు స్వచ్ఛమైన గాలి లభిస్తుంది మంత్రి అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించే బాధ్యతను కూడా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీసుకోవాలని, చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణపై పిల్లల్లో అవగాహన పెంచినప్పుడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారన్నారు. గురుకుల విద్యాలయాలలో మౌలిక వసతులతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందిని మంత్రి స్పష్టం చేశారు.



# దశాబ్దాల వంతెన కలను నిజం చేస్తూ నిర్మాణానికి శ్రీకారం

- మక్రివలస ప్రజల హర్షధ్వానాల మధ్య శంకుస్థాపన
- ఎన్నికల హామీ నెరవేర్చటం పట్ల సంతోషం
- రూ. 6.5కోట్లతో వంతెన నిర్మాణం
- రూ.10 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం ప్రారంభం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విజయనగరం (చైతన్య రథం): మండలంలోని మక్రివలస ప్రజల దశాబ్దాల వంతెన కలను నిజం చేస్తూ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆంధ్ర ఆర్ అండ్ బి రోడ్డు నుండి మక్రివలస వరకు 6 కోట్ల 50 లక్షల రూపాయల నిధులతో నిర్మాణం చేపట్టబోయే రోడ్డు మరియు వంతెన నిర్మాణానికి మక్రివలస ప్రజల హర్షధ్వానాల మధ్య ఆదివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షల రూపాయలతో నిర్మించిన మక్రివలస గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన వాగ్దానం మేరకు మక్రివలస ప్రజల చిరకాల వాంఛ అయిన వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఆధ్వర్యంలో నాటి శాసనసభ్యులు కెఎ నాయుడి ఆధ్వర్యంలో గతంలోనే చంపావతి ప్రవహించే కొనిస, పట్రువాడ, మక్రివలస గ్రామాల రాకపోకల నిమిత్తం వంతెనల నిర్మాణానికి నాంది పలకడం జరిగిందన్నారు. అందులో భాగంగానే యువ నాయకులు నారా లోకేష్ కొనిస, పట్రువాడ వంతెనలను పూర్తిచేసి ప్రారంభించడం జరిగిందన్నారు.

నియోజకవర్గంలోని దత్తి పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చిన సందర్భంలో నియోజకవర్గానికి సార్వగడ్డ రిజర్వాయర్, మక్రివలస, జామి మండలంలో వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరడం జరిగిందని, ముఖ్యమంత్రి వెంటనే వరాలు ప్రకటించడం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న మక్రివలస వంతెన నిర్మాణం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టితో కేంద్ర ప్రభుత్వ సహకారంతో సాస్కి ప్రాజెక్ట్ నిధులను మంజూరు చేయటం జరిగిందన్నారు. తన తాత పైడితల్లి నాయుడిని ఆదర్శంగా తీసుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్టు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. 2004 ఎన్నికలలో అప్పటి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రమంతా వైయస్సార్ గాలి వీసినప్పటికీ ఎంపీగా తాతయ్య పైడితల్లి నాయుడు గెలుపొందటానికి నియోజకవర్గం ప్రజలే ముఖ్య కారణమన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు కావలసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అందించడం జరుగుతుందని, ప్రజలందరూ కూడా ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. అలాగే గ్రామ ప్రజల సౌకర్యార్థం గ్రామ పంచాయతీ భవనం కూడా నిర్మించడం జరిగిందన్నారు. గజపతినగరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంవత్సరంలో పూర్తి చేయటంతో పాటు మంచి వైద్యులను ఏర్పాటు చేసి మెరుగైన చికిత్స అందించేలా చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఉన్న చిన్నారులందరిని కూడా తప్పనిసరిగా చదివించాలని, చదువు ద్వారానే మంచి భవిష్యత్తును పొందవచ్చని, చదువుకోవటం ద్వారా కుటుంబ జీవన విధానం మారుతుందని మంత్రి పిలుపునిచ్చారు.

యువ నాయకులు నారా లోకేష్ ఉద్యోగాల కల్పనకు అనేక కంపెనీలను రాష్ట్రానికి తీసుకురావడం జరుగుతుందన్నారు. మెంటాడ, గజపతినగరం, పురిటిపెంట రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. అలాగే గ్రామంలో అంగన్వాడి, పాఠశాల భవనం శిథిలావస్థకు చేరినట్లు గ్రామస్తులు మంత్రి కొండపల్లి దృష్టికి తీసుకువెళ్లగా వచ్చే సంవత్సరానికల్లా భవన నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. మక్రివలస స్టేజ్ దగ్గర విద్యార్థుల కోసం బస్సు ఆగేలా ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికలలో ప్రజలకు మంచి చేస్తున్న కూటమి నాయకులను గెలిపించాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి కొండపల్లి పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి మాట్లాడుతూ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాటలు చెప్పరని, చేతలు చేసి చూపిస్తారని అనడానికి నిదర్శనమే ఈ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయటం అన్నారు.

ఏఎంసీ చైర్మన్ పీవీవి గోపాల రాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని, కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. బీజేపీ నాయకురాలు రెడ్డి పావని మాట్లాడుతూ దశాబ్దాల కలను సాకారం చేసిన ఘనత మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు దక్కుతుందన్నారు. మంత్రి ఎంతో ముందు చూపుతో వంతెన నిర్మాణానికి చిన్నారులతో రిబ్బన్ కట్ చేపించారని, భావితరాల వారి భవిష్యత్తుకు నాంది పలకటం సంతోషంగా ఉందన్నారు. మక్కువ శ్రీధర్ మాట్లాడుతూ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న చిరకాల స్వప్నమైన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయటం తెలుగుదేశం పార్టీ చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. పిఎసిఎస్ డైరెక్టర్ కుమార్ మాట్లాడుతూ రైతన్నల పంటల కోసం ఆంధ్ర రిజర్వాయర్ మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తులు పలువురు మాట్లాడుతూ మక్రివలస గ్రామ రాకపోకల సౌలభ్యం కోసం వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోతుందని అనుకున్నామని, వంతెన నిర్మాణంతో మా చిన్నారుల భవిష్యత్తులు మారడంతోపాటు, విద్య, వైద్యం కోసం రవాణా సదుపాయం వేగవంతంగా జరుగుతుందని ఆనంద భాష్పాలతో తెలిపారు. భక్తుల కోరిక నెరవేర్చిన దేవుడితో మా గ్రామ ప్రజలకు సమానమని మంత్రి కొండపల్లిని కొనియాడారు. కూటమి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎం కోనసీమ పర్యటన విజయవంతం చేద్దాం



- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి వాసంశెట్టి సుభాష్
- పార్టీ క్యాడర్‌తో సమావేశమై చర్చించిన మంత్రి

అంబాజీపేట (చైతన్య రథం): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 9న పర్యటించనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లను రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం పరిశీలించారు. అమలాపురం పార్లమెంట్ సభ్యులు హరీష్ మాధుర్, గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులతో కలిసి సీఎం పర్యటించే ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంతో పాటు పార్టీ కేడర్ సమావేశంలో పాల్గొననున్న నేపథ్యంలో సభా ప్రాంగణం, హెలీప్యాడ్, భద్రతా ఏర్పాట్లు, రాకపోకల మార్గాలను మంత్రి పరిశీలించారు. అనంతరం పి.గన్నవరం నియోజకవర్గంలోని అంబాజీపేటలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశమై పర్యటన విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈనెల 9న ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామంలో రూ.72 కోట్లతో చేపట్టనున్న లొల్లా లాకుల ఆధునీకరణ పనులను ముఖ్యమంత్రి పరిశీలించనున్నట్టు తెలిపారు. అలాగే రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ పర్యటనను ప్రజలందరూ భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేలు, అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్, జిల్లా టీడీపీ అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: మంత్రి మండిపల్లి

రాయచోటి (చైతన్య రథం): ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి వ్యాఖ్యానించారు. చిన్నమండెం మండలం బోరెడ్డిగారి పల్లెలోని తన సొంత నివాసంలో రవాణా, యువజన క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి హామీ ఇచ్చారు.

## రూ.8.74 కోట్లతో లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి శ్రీకారం

నెల్లూరు (చైతన్య రథం): నెల్లూరు జిల్లాలోని ప్రసిద్ధ నరసింహకొండ శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని మరింత దివ్యమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రూ.8.74 కోట్ల సీజీఎఫ్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతోపాటు ఆలయ ప్రాశస్త్యాన్ని మరింత పెంచేలా అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక చొరవతోపాటు కోటంరెడ్డి సోదరుల కృషితో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. భవిష్యత్‌లో నరసింహకొండను మరింత సుందరంగా, ఆధ్యాత్మికంగా, భక్తులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దేలా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.

# పసిడి ప్రదేశ్ దిశగా పరుగులు!

నాటి ఐటీ విప్లవం, నేడు జల విప్లవం. ఎకనామిక్ టైమ్స్ విశ్లేషణ అద్దం పట్టిన నిజం. ఎకనామిక్ టైమ్స్‌వంటి ప్రతిష్టాత్మక జాతీయ పత్రికలోనూ కొనియాడిన చంద్రబాబు విధానాలే నేడు రాష్ట్రాన్ని పసిడి ప్రదేశ్ దిశగా పరుగులు పెట్టిస్తున్నాయి. జాతీయస్థాయిలో ఆర్థిక నిపుణులు మరియు ప్రముఖ పత్రికలు సైతం చంద్రబాబు అమలు చేస్తున్న గ్రామీణ, జల వనరుల అభివృద్ధి విధానాలను ఆశ్చర్యంతో గమనిస్తూ కథనాలు రాయడం అభినందనీయం. ఎకనామిక్ టైమ్స్ విశ్లేషణ ప్రకారం, 1990లలోనే కుప్పంలో డ్రిప్ ఇరిగేషన్, ఉద్యానవనాలు, డెయిరీ, పట్టు పరిశ్రమవంటి రంగాలకు ప్రోత్సాహించారు. నీటిని పొదుపుగా ఉపయోగిస్తూ వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చాలనే ఆలోచన అక్కడి నుంచే ప్రారంభమైంది. నాటి చంద్రబాబు విజన్ రాష్ట్రానికి డిజిటల్ గుర్తింపు తెచ్చింది. నేడు అదే పట్టుదలతో ఆంధ్రప్రదేశ్‌ను పసిడి ప్రదేశ్‌గా మార్చేందుకు మరో మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టారు. గతంలో సాంకేతికతకు ఎంతటి పీఠం వేశారో, ఇప్పుడు సాగునీటి రంగానికి అంతకంటే గొప్ప పీఠం వేస్తున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఎవరూ ఊహించని రీతిలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఐటీ రంగాన్ని శాసించి, సైబరాబాద్‌ను సృష్టించి, లక్షలాది మంది యువతకు గ్లోబల్ ఉద్యోగ అవకాశాలు కల్పించిన దార్శనికుడు ఆయన. ఇప్పుడు జల సంరక్షణ మరియు భారీ ప్రాజెక్టుల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అత్యున్నత స్థాయికి తీసుకెళ్తున్నారు. దశాబ్దాలుగా అసంపూర్తిగా నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులకు మళ్లీ ప్రాణం పోస్తూ, ఇంజనీరింగ్ అద్భుతాలను ఆవిష్కరిస్తున్నారు. జలవనరుల ద్వారా ప్రతి ఎకరానికీ నీరు అందించి ఆంధ్రప్రదేశ్‌ను పసిడి ప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అప్పట్లో కంప్యూటర్‌ను భవిష్యత్తు అభివృద్ధికి చోదకశక్తిగా గుర్తించిన చంద్రబాబు. ఇప్పుడు నీటిని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతికి జీవనాడిగా చూస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టులతో రైతు భవిష్యత్తును మార్చే దిశగా అడుగులు వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక సాగునీటి ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పూర్తి చేసి ఆయకట్టుకు నీరు అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారు. ఆ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే కొత్తగా సాగులోకి వచ్చే భూములు, పెరిగే పంటల ఉత్పత్తి, మెరుగుపడే రైతుల ఆదాయం, విస్తరించే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఇవన్నీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిచ్చే అవకాశం ఉంది.

### నాటి ఐటీ విప్లవం నుంచి నేటి జల విప్లవం వరకు చంద్రబాబు ప్రస్థానం

ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగానికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడు అందరికీ అర్థం కాలేదు. కంప్యూటర్లు, సాఫ్ట్‌వేర్, ఐటీ సంస్థలు, హైటెక్ మౌలిక వసతులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఎంతగా మార్చగలవో ఆయన ముందుగానే అంచనా వేశారు. ఫలితంగా హైదరాబాద్ ఐటీ రంగంలో దేశంలోని ప్రముఖ నగరాలతో పోటీ పడే స్థాయికి ఎదిగింది. వేలాది కంపెనీలు, లక్షలాది ఉద్యోగాలు, భారీ పెట్టుబడులు.. నేడు ఆ ఐటీ పునాదుల ప్రభావం కనిపిస్తోంది. ఇప్పుడు అదే దూరదృష్టితో జలవనరుల రంగంపై దృష్టి పెట్టారు. రాష్ట్రంలో విస్తారమైన నదులు ఉన్నా, ప్రతి ప్రాంతానికి నీరు చేరే పరిస్థితి లేదు. ఒక




ప్రాంతంలో వరదలు, మరో ప్రాంతంలో కరువు. ఈ వైరుధ్యాన్ని తొలగించాలంటే ప్రాజెక్టులను పూర్తి చేయడం, కాలువల వ్యవస్థను బలోపేతం చేయడం, నీటిని సమర్థంగా వినియోగించడం అవసరం. అందుకే వెలిగొండ నుంచి పోలవరం వరకు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ ప్రాంతాల రైతులకు నీటి భద్రతను పెంచే ప్రాజెక్టులు పూర్తికి నడుం బిగించడంతో ఆ ప్రాంతాల్లో వ్యవసాయ ముఖచిత్రమే మారనున్నది. ముఖ్యంగా వెలిగొండ వంటి ప్రాజెక్టు దశాబ్దాల నిరీక్షణకు తెరదించి ప్రకాశం, నెల్లూరు, రాయలసీమలోని అనేక ప్రాంతాలకు కొత్త ఆశలు చిగురింపజేశారు. అదే సమయంలో పోలవరం వంటి బహుళ ప్రయోజన ప్రాజెక్టు కీలకమైనది. గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవడం, డెల్టా ప్రాంతాల సాగునీటి భద్రత, తాగునీరు, పారిశ్రామిక అవసరాలు అనేక అంశాలపై దాని ప్రభావం చూప నున్నది. ఒక్కో ప్రాజెక్టు పూర్తి చేస్తున్న కొద్దీ ఒక్కో ప్రాంతం పచ్చబడుతుంది. ఒక్కో ప్రాంతం పచ్చబడు తున్న కొద్దీ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. చంద్రబాబు రాజకీయ ప్రయాణంలో విజన్ అనే పదానికి ప్రత్యేక స్థానం ఉంది. గతంలో ఐటీని ముందుకు తెచ్చినప్పుడు ఆయన చూసింది రాబోయే తరాల భవిష్యత్తు గురించి. ఇప్పుడు సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించడం కూడా లక్ష్యం అదే.. రాబోయే తరాలకు నీటి భద్రత, రైతుకు ఆదాయ భద్రత, రాష్ట్రానికి ఆర్థిక భద్రత కల్పించడం.

ఆంధ్రప్రదేశ్‌కు సహజ వనరులు ఉన్నాయి. సారవంతమైన భూములు ఉన్నాయి. సముద్ర తీరం ఉంది. నదులు ఉన్నాయి. రైతులు ఉన్నారు. కష్టపడే ప్రజలు ఉన్నారు. వీటన్నింటినీ సమర్థంగా అనుసంధా నించగలిగితే రాష్ట్రం అపారమైన ఆర్థిక శక్తిగా ఎదగగలదు. నాడు హైదరాబాద్ ఆకాశహర్మ్యాల్లో మెరిసి ఐటీ ప్రపంచానికి చంద్రబాబు దూరదృష్టి ప్రతీకగా నిలవగా, నేడు ఆంధ్రప్రదేశ్ పల్లెల్లో పచ్చని పొలాలు, నిండిన చెరువులు, కళకళలాడే కాలువలు, సిరులు పండించే రైతు కుటుంబాలు ఆయన జల దృష్టికి ప్రతీకలుగా నిలవనున్నాయి. తలపెట్టిన ప్రాజె క్టులన్నీ పూర్తయితే, రాష్ట్రంలోని ప్రతిజిల్లా సస్య శ్యామలమై, నిజమైన పసిడి ప్రదేశ్‌గా రూపాంతరం చెందనున్నాయి. వ్యవసాయ అభివృద్ధికి కేవలం నీటిని అందించడమే కాకుండా, ఆధునిక సాంకేతికతను జోడించి వ్యవసాయాన్ని లాభసాటి వ్యాపారంగా మారుస్తున్నారు.

### మహోన్నత ప్రాజెక్టుల పూర్తిపై క్రెడిట్ చోరీ ఏడుపులు!

వెలిగొండ, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణంపై చంద్రబాబుది క్రెడిట్ చోరీ అంటూ ఆరోపణ చేసే ముందు జగన్ రెడ్డి, షర్మిళ ఒకసారి ఆ ప్రాజెక్టుల చరిత్రను పూర్తిగా తెలుసుకుంటే మంచిది. వెలిగొండ, పోలవరం వంటి మహా ప్రాజెక్టుల విషయంలో ఎవరి హయాంలో ఎంత పని జరిగింది? ఎవరి హయాంలో ఎక్కువ నిధులు ఖర్చు పెట్టారు? ఎన్ని అడ్డంకులు తొలగించబడ్డాయి? ప్రజలకు ఎంత ప్రయోజనం చేకూరింది అన్నది చెప్పాలి. అలా కాకుండా రైతు సంక్షేమం కోసం పూర్తి చేస్తున్న మహోన్నత ప్రాజెక్టులను కూడా రాజకీయ లబ్ధికి వేదికగా మార్చడం దురదృష్టకరం. వెలిగొండ మరియు పోలవరం ప్రాజెక్టులపై జగన్ రెడ్డి, షర్మిల వంటి నాయకులు చంద్రబాబు క్రెడిట్ చోరీ అంటూ చేస్తున్న విమర్శలు కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ వ్యూహమే తప్ప మరొకటి కాదు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల కరవు కాటకాలను తరిమికొట్టేందుకు ఉద్దేశించిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు 1996లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడే శంకుస్థాపన చేశారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో ఈ ప్రాజెక్టు అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నది. తర్వాత వైఎస్ హయాంలో పనులు సాగిన మాట వాస్తవమే. కానీ 2019-2024 మధ్య వెలిగొండ సొరంగ పనులను మరియు ప్రాజెక్ట్ పూర్తి చేయడంలో ఎందుకు విఫలమయ్యారు? టన్నెళ్లలో టీబీఎం యంత్రాలు ఎందుకు ఇరుక్కుపోయాయి? ప్రాజెక్ట్ పూర్తి చేసిన ఘనత మాదే అంటున్న జగన్, తన హయాంలో నిర్వాసితుల పునరావాసం పూర్తి చేయడంలో ఎందుకు విఫలమయ్యారో సమాధానం చెప్పాలి. వెలిగొండ సొరంగ మార్గాలు, ఫీడర్ కెనాల్ పనులు ఎందుకు నత్తనడకన సాగాయి? దీనికి జగన్ ఏ సమాధానం చెబుతారు? ఎన్నికల ముందు పూర్తి కాకుండా ప్రాజెక్టు ప్రారంభించి చేతులు దులుపుకోవడం తప్ప వెలిగొండకు మీరు చేసింది ఏమిటి? కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి, కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు విజయవంతంగా మళ్లించి జాతికి అంకితం చేసి, దశాబ్దాల కలను నిజం చేసిన నాయకుడిపై క్రెడిట్ చోరీ అంటూ ఆరోపణలు చెయ్యడానికి సిగ్గు అనిపించడం లేదా? అట్లాగే పోలవరం శాపానికి మీ విధానాలు కారణం కాదా? ప్రపంచ స్థాయి ఇంజనీరింగ్ అద్భుతంగా రూపుదిద్దుకోవాల్సిన పోలవరం, మీ అనాలోచిత రివర్స్ టెండరింగ్ విధానం వల్ల తీవ్రంగా దెబ్బతిన్నది నిజం కాదా? అనుభవం లేని నిర్ణయాల కారణంగా డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడం, ఐదేళ్లపాటు ప్రాజెక్టు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోవడం రాష్ట్ర ప్రజలు కళ్లారా చూశారు. నేడు కూటమి ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ, గ్యాప్-1, గ్యాప్-2 మరియు ఈసీఆర్ఎఫ్ పనులను మళ్లీ గాడిలో పెట్టి, నిర్దేశిత కాలపరిమితిలోగా ప్రాజెక్టును పూర్తి చేయడానికి అహర్నిశలు కృషి చేస్తుంటే హర్షించాల్సింది పోయి క్రెడిట్ చోరీ అంటూ ఏడవడం ఏమిటి? రైతులకు సాగునీరు అందించేందుకు ప్రాజెక్టులు పూర్తి చేస్తుంటే ఓర్వలేక క్రెడిట్ చోరీ అంటూ ఆరోపణలు చెయ్యడం మీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం కాదా? వెలిగొండ జాతికి అంకితం చెయ్యడం అయినా, పోలవరం పురోగతి అయినా చంద్రబాబు దృఢసంకల్పానికి, చిత్తశుద్ధికి తార్కాణం. ఇప్పటికైనా జగన్ రెడ్డి పిచ్చి తుగ్లక్ ఆరోపణలు మాని, రాష్ట్ర ప్రయోజనాల కోసం నిర్మాణాత్మకంగా వ్యవహరించడం మంచిది.

### నాటి విప్లవం నుంచి నేటి జల విప్లవం వరకు!

ఏది ఏమైనా రాష్ట్రంలో ఒక్కో ప్రాజెక్టును పూర్తి చేయడం మాత్రమే కాకుండా, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం, ఇప్పటికే ఉన్న కాలువలు-రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పెంచడం, నీటి సంరక్షణ పనులను విస్తరించడం, నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేయడం వంటి అంశాలపై దృష్టి పెట్టారు సీఎం చంద్రబాబు. 2026 ఇరిగేషన్ క్యాలెండర్‌లో 36 ప్రాధాన్య ప్రాజెక్టులకు రూ.35,555 కోట్ల అంచనా వ్యయంతో 2026 నుంచి 2028 డిసెంబర్ వరకు పూర్తి గడువులు నిర్దేశించినట్లు ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది. వెలిగొండ తొలి దశ ప్రారంభం, అదే సమయంలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదల చెయ్యడం, ఒకే వారంలో చోటుచేసుకున్న రెండు జల ఘట్టాలుగా ఎకనామిక్ టైమ్స్ విశ్లేషించింది. పోలవరం జల విప్లవానికి కేంద్రబిందువు. భవిష్యత్తులో పోలవరం అత్యంత కీలకమైన ప్రాజెక్టు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి అయితే ఆంధ్రప్రదేశ్ జల ఆర్థిక వ్యవస్థకు ఒక వెన్నెముక అవుతుంది. కావునా ఐటీ అభివృద్ధిలో చంద్రబాబు పాత్రను ఒక తరం గుర్తుంచుకుంటే, ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి ప్రాజెక్టుల పూర్తితో మరో తరం గుర్తుంచుకునే అవకాశం ఏర్పడింది. అందుకే ఎకనామిక్ టైమ్స్ విశ్లేషణలో సీఈఓ-సీఎం నుంచి వాటర్‌మ్యాన్‌గా ఆయనను వర్ణించడం జరిగింది. నాడు సైబర్ టవర్స్‌లో యువత భవిష్యత్తు కనిపించగా, నేడు కాలువల్లో, రిజర్వాయర్లలో, పొలాల్లో రైతుల భవిష్యత్తు కనిపిస్తోంది. ఆయన ప్రస్థానాన్ని ఒక వాక్యంలో.. నాటి ఐటీ విప్లవం నుంచి నేటి జల విప్లవం వరకు చంద్రబాబు ప్రయాణం.

- నీరుకొండ ప్రసాద్

## మున్సిపల్ ఎన్నికలకు కొత్త నిబంధనలు

అమరావతి(చైతన్యరథం): ఏపీలో మున్సిపల్ ఎన్నికల నిర్వహ ణపై కొత్త నిబంధనలను ప్రభుత్వం జారీ చేసింది. మున్సిపల్ (సవరణ) చట్టం-2026 అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆగస్టు 28వ తేదీ నుంచే చట్టసవరణ అమల్లోకి వస్తుందని స్పష్టం చేసిం ది. ఈ మేరకు జీవో నంబర్- 210ని జారీ చేసింది. మేయర్, కార్పొరేటర్ల ఎన్నికల నియమావళిని ఖరారు చేస్తూ మరో జీవో నంబర్ - 211ని పురపాలక శాఖ జారీ చేసింది. ఈ నేపథ్యంలో నామినేషన్ డిపాజిట్లను ఖరారు చేసింది. జనరల్ అభ్యర్థులకు రూ.5,000, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.2,500 డిపాజిట్ చేయాలని ఏపీ సర్కార్ పేర్కొంది. ఒక అభ్యర్థి గరిష్ఠంగా 4 సెట్ల నామి నేషన్లు మాత్రమే వేసేందుకు ఏపీ ప్రభుత్వం అవకాశం కల్పిం చింది. అభ్యర్థుల నేర చరిత్ర, ఆస్తులు, అప్పులు, విద్యార్హతలపై నోటరీతో కూడిన అఫిడవిట్ తప్పనిసరి అని స్పష్టం చేసింది. పోలింగ్ కేంద్రాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే ఓటు రద్దు చేస్తామని హెచ్చరించింది. బ్యాలెట్ పేపర్ వెనక్కు తీసుకునే సర్వాధికారాలు ప్రిసైడింగ్ అధికారికి అప్పగించినట్లు తెలిపింది. అంధులు, వృద్ధు లకు ఓటింగ్ సమయంలో సాయం చేసేందుకు 18 ఏళ్లు నిండిన ఒకరికి మాత్రమే అనుమతి ఉంటుందని వెల్లడించింది. ఓ వ్యక్తి కేవలం ఒక్క ఓటరుకు మాత్రమే సహాయకుడిగా ఉండాలనే కఠిన నిబంధనను ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.






## 2024 జూన్ 12...

ఆ రోజు ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది కేవలం ప్రభుత్వ మార్పు కాదు. ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుతో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాల్సిన మహత్తర బాధ్యతను నారా చంద్రబాబునాయుడు స్వీకరించిన రోజు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన క్షణం నుంచి ఆయన ముందున్నది అధికార వైభవం కాదు... సమస్యలతో సతమతమవుతున్న రాష్ట్రం, ఆర్థిక ఒత్తిడి, నిలిచిపోయిన ప్రాజెక్టులు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత, భరోసా కోరుతున్న రైతులు, పేదలు, మహిళలు. అందుకే చంద్రబాబు పాలన తొలి రోజు నుంచే ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది... "సమయం తక్కువ... పని ఎక్కువ... రాష్ట్రాన్ని నిలబెట్టడం ఒక్కటే లక్ష్యం."




# రాష్ట్ర భవిష్యత్తును చూస్తున్న నాయకుడు

## రెండేళ్ల నిరంతర శ్రమతో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి చంద్రబాబు కొత్త దిశ

### ప్రమాణస్వీకారం నుంచే కార్యక్షేత్రంలోకి...

సాధారణంగా కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పుడు కొంతకాలం సమీక్షలు, సన్మానాలు, అభినందనలతో గడుస్తుంది. కానీ చంద్రబాబు ప్రయాణం అలా సాగలేదు. బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజులకే అమరావతి ప్రాంతంలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. రాజధానిలో నిలిచిపోయిన నిర్మాణాలు, రహదారులు, రైతులకు సంబంధించిన సమస్యలను స్వయంగా పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి రాజధాని అంటే కేవలం భవనాలు కాదని, అది ప్రజల ఆత్మగౌరవమని తన కార్యాచరణతో చాటిచెప్పారు.

అదే సమయంలో పోలవరం ప్రాజెక్టును తిరిగి ప్రాధాన్య క్రమంలోకి తీసుకొచ్చారు. ప్రాజెక్టు పరిస్థితిని సమీక్షించడం, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడం, సాంకేతిక సమస్యలకు పరిష్కారాలు వెతకడం - ఈ మొత్తం ప్రక్రియలో చంద్రబాబు చూపిన పట్టుదల ఒక విషయాన్ని స్పష్టం చేసింది. రైతుల భవిష్యత్తును మార్చే జీవనాడి వంటి ప్రాజెక్టులను రాజకీయ ప్రకటనలుగా కాకుండా, పూర్తి చేయాల్సిన బాధ్యతగా ఆయన భావించారు.



### పేదవాడి ఇంటి తలుపు తట్టిన పాలన

2024 జూలై 1న గుంటూరు జిల్లా పెనుమాకలో చంద్రబాబు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో కూర్చుని బటన్ నొక్కడం మాత్రమే పాలన కాదని, ప్రభుత్వ సాయం అందుకున్న పేదవాడి ముఖంలో కనిపించే భరోసాను ప్రత్యక్షంగా చూడాలని ఆయన భావించారు.

పింఛను తీసుకుంటున్న వృద్ధుల చేతిని పట్టుకోవడం, పేద కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవడం, అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు ఇవ్వడం... ఇవి చంద్రబాబు పాలనా విధానంలోని మానవీయ కోణాన్ని చూపించాయి. ఆ తర్వాత అన్న క్యాంటీన్లను పునరుద్ధరించారు. రోజువారీ కూలీలు, ఆటో డ్రైవర్లు, ఆసుపత్రులకు వచ్చే పేదలు, చిరుద్యోగులకు తక్కువ ధరలో ఆహారం అందించే వ్యవస్థను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. 2026 ఏప్రిల్ నాటికి పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు కలిపి 269 అన్న క్యాంటీన్లు పనిచేస్తుండగా, 21 నెలల్లో 8.80 కోట్ల భోజనాలను అందించినట్టు నమోదైంది.

దీపం-2 పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని 2024 నవంబరు 1న ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా ఈదుపురంలో ఒక లబ్ధిదారు ఇంటికి వెళ్లి స్వయంగా సిలిండర్ అందించడం ద్వారా సంక్షేమ పథకానికి మానవీయ రూపం ఇచ్చారు.

తల్లికి వందనం ద్వారా పిల్లలను చదివించే అర్హులైన తల్లులకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. 2025 జూన్‌లో ఈ పథకం అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. కుటుంబంలో ఎంతమంది అర్హులైన పిల్లలు ఉన్నా వారి చదువుకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో పథకాన్ని రూపొందించారు.

### వరదల్లో కార్యాలయం కాదు... ప్రజల మధ్యే ముఖ్యమంత్రి

2024 సెప్టెంబరులో విజయవాడను బుడమేరు వరదలు ముంచెత్తినప్పుడు చంద్రబాబు నాయకత్వంలోని అసలు కార్యదీక్ష రాష్ట్ర ప్రజలకు ప్రత్యక్షంగా కనిపించింది. అర్ధరాత్రి అయినా, వర్షం కురుస్తున్నా, వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నా ఆయన వెనక్కి తగ్గలేదు. బోటులో, జేసీబీపై వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రయాణిస్తూ బాధితులను పరామర్శించారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు విజయవాడలోనే ఉంటానని ప్రకటించి... ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద బస్సులోనే బస చేస్తూ సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఆహారం, తాగునీరు, మందులు, విద్యుత్ పునరుద్ధరణ, పారిశుధ్యం వంటి ప్రతి అంశంపై అధికారులకు నిరంతరం ఆదేశాలు ఇచ్చారు. వరద నష్టాన్ని



సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా అంచనా వేయించి, 4 లక్షల మందికి పైగా బాధితులకు రూ.602 కోట్ల పరిహారం పంపిణీ చేశారు.
ఆ విపత్తు సమయంలో చంద్రబాబు చూపిన తీరు ఒక ముఖ్యమైన నాయకత్వ సూత్రాన్ని గుర్తు చేసింది...
సంక్షోభ సమయంలో ప్రజల ముందు నిలబడేవాడే నిజమైన నాయకుడు. సమస్య పరిష్కారమయ్యే వరకు నిద్రపోనివాడే ప్రజల సీఎం.




### ఢిల్లీ నుంచి దావోస్ వరకు... రాష్ట్ర ప్రయోజనమే ఎజెండా

రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని చంద్రబాబు స్పష్టంగా గుర్తించారు. 2024 జూలైలో జరిగిన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో పాల్గొని ఆంధ్రప్రదేశ్ అవసరాలు, అభివృద్ధి అవకాశాలు, మౌలిక సదుపాయాల ప్రాధాన్యాన్ని జాతీయ వేదికపై ప్రస్తావించారు.

అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధులతో రాష్ట్ర మౌలిక సదుపాయాల అభివృద్ధిపై చర్చలు జరిపారు. టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్‌తో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామిక అవకాశాల విస్తరణపై చర్చించారు.

సింగపూర్‌లోని టువాస్ పోర్టును సందర్శించి పోర్టు ఆధారిత పరిశ్రమలు, అధునాతన లాజిస్టిక్స్, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధిని ప్రత్యక్షంగా అధ్యయనం చేశారు. ఇతర ప్రాంతాల్లో విజయవంతమైన నమూనాలను ఆంధ్రప్రదేశ్ అవసరాలకు అనుగుణంగా తీసుకురావాలనే ప్రయత్నానికి ఈ పర్యటన ఒక ఉదాహరణ.

దావోస్‌కు వెళ్లినప్పుడు కూడా సమావేశాలు ముగిశాయని విశ్రాంతి తీసుకోలేదు. రోజంతా జరిగిన చర్చల పురోగతిని రాత్రి అధికారులతో సమీక్షించి, ఏ ప్రతిపాదనను ఎంత వేగంగా ముందుకు తీసుకెళ్లాలో నిర్దేశించారు.


ఆర్సెలర్‌మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్రాజెక్టు పురోగతిపై లక్ష్మీ మిత్తల్‌తో చర్చలు జరపడం, అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం, క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్, భారీ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై ప్రపంచస్థాయి సంస్థలతో సంప్రదింపులు జరపడం ఆయన భవిష్యత్ దృష్టిని ప్రతిబింబించాయి.

...మిగతా 11వ పేజీలో

చైతన్యరథం




# గడియారాన్ని కాదు...






### నేటి సమస్యలకు పరిష్కారం... రేపటి తరాలకు ప్రణాళిక

చంద్రబాబు పాలనలో రోజువారీ సమస్యల పరిష్కారంతో పాటు రాష్ట్ర దీర్ఘకాలిక భవిష్యత్తుకు సమాన ప్రాధాన్యం కనిపిస్తుంది. "స్వర్ణాంధ్ర-2047" ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, మానవ వనరుల అభివృద్ధి, పేదరిక నిర్మూలన, సాంకేతికత, సుస్థిర వ్యవసాయం, పారిశ్రామికీకరణ వంటి రంగాలకు దీర్ఘకాలిక దిశను రూపొందించారు. ప్రణాళికలు కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జిల్లాలు, నియోజకవర్గాల స్థాయి వరకు చేరాలనే విధానాన్ని ముందుకు తీసుకొచ్చారు.

పేదరిక నిర్మూలన కోసం పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్ట్‌నర్‌షిప్ ఆధారంగా 'పీ4' విధానాన్ని ప్రతిపాదించారు. ప్రభుత్వం ఒక్కటే కాకుండా సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన వ్యక్తులు, సంస్థలు, ప్రవాసాంధ్రులు కూడా పేద కుటుంబాలకు మార్గదర్శకులుగా నిలవాలన్నది ఈ ఆలోచన. 2025 మార్చిలో జీరో పావర్టీ-పీ4 కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.

# రాష్ట్ర భవిష్యత్తును చూస్తున్న నాయకుడు

## రెండేళ్ల నిరంతర శ్రమతో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి చంద్రబాబు కొత్త దిశ

...10వ పేజీ తరువాయి




### విద్యార్థి భవిష్యత్తును కుటుంబ బాధ్యతగా మార్చిన నాయకత్వం

విద్యలో ప్రభుత్వం, ఉపాధ్యాయులు, విద్యార్థులు మాత్రమే కాకుండా తల్లిదండ్రులు కూడా భాగస్వాములు కావాలని చంద్రబాబు భావించారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్-టీచర్ సమావేశాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

2026 జూలై 24న రంపచోడవరంలో జరిగిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0లో పాల్గొని గిరిజన ప్రాంతాల్లో పాఠశాల విద్య, మౌలిక సదుపాయాలు, డిజిటల్ కనెక్టివిటీ, విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. తల్లికి వందనం సాయం అందిందా అని స్వయంగా తల్లులను అడిగి తెలుసుకున్నారు. ఒక ముఖ్యమంత్రి తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థితో మాట్లాడటం చిన్న సంఘటనలా కనిపించవచ్చు. కానీ ఆ విద్యార్థికి అది జీవితాంతం నిలిచే ప్రేరణ. ఉపాధ్యాయుడికి బాధ్యతను గుర్తుచేసే సందర్భం. తల్లిదండ్రులకు ప్రభుత్వం తమ పిల్లల భవిష్యత్తును పట్టించుకుంటోందనే నమ్మకం.

సమీక్షలతో కాదు... ఫలితాలతో కొలిచే పాలన


ఉదయం క్షేత్ర స్థాయి పర్యటన...
మధ్యాహ్నం ప్రజలతో సమావేశం...
సాయంత్రం శాఖల సమీక్ష...
రాత్రి పెట్టుబడిదారులతో చర్చలు...
విపత్తు వస్తే కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షణ...
ప్రాజెక్టు ఆగితే కేంద్రంతో సంప్రదింపులు...
ప్రజలకు సమస్య వస్తే అధికారులకు గడువు.
ఇదే చంద్రబాబు పని విధానం.

ఆయనకు సమీక్ష అంటే అధికారులతో సమావేశమై ముగించడం కాదు. గత సమావేశంలో ఇచ్చిన ఆదేశం ఎంత వరకు అమలైంది? ఆలస్యానికి కారణం ఏమిటి? ప్రజలకు ఫలితం ఎప్పుడు అందుతుంది? అనే ప్రశ్నలకు సమాధానం రాబట్టడం.

సాంకేతికతను పరిపాలనలో వినియోగించడం, రియల్‌టైమ్ సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం, శాఖలకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించడం, క్షేత్రస్థాయిలో ఫలితాలను పరిశీలించడం- ఇవీ రెండేళ్ల పాలనలో స్పష్టంగా కనిపించిన లక్షణాలు.

### రెండేళ్లు... ఒక నాయకుడి శ్రమకు సాక్ష్యం

2024 జూన్ 12 నుంచి 2026 జూలై 24 వరకు సాగిన ఈ ప్రయాణాన్ని కేవలం తేదీలతో కొలవలేం.
అమరావతిలో తిరిగి మొదలైన ఆశతో కొలవాలి.
పోలవరం వైపు పడిన ప్రతి అడుగుతో కొలవాలి.
వరద నీటిలో ప్రజల మధ్య తిరిగిన రాత్రులతో కొలవాలి.
పేదవాడికి అందిన భోజనంతో కొలవాలి.
తల్లి ఖాతాలో చేరిన విద్యా సహాయంతో కొలవాలి.
పెట్టుబడి కోసం జరిగిన ప్రతి సమావేశంతో కొలవాలి.
ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు కలిగిన






కొత్త నమ్మకంతో కొలవాలి.
చంద్రబాబు చూపిస్తున్న నాయకత్వం ఒక విషయాన్ని నిరూపిస్తోంది.
వయసు శరీరానికి సంబంధించిన సంఖ్య మాత్రమే.
దూరదృష్టి ఉన్న నాయకుడికి పని చేయాలనే సంకల్పమే నిజమైన శక్తి.
ఆయన విశ్రాంతి తీసుకుంటే ఒక ఫైలు ఆలస్యమవుతుందేమో...
ఒక ప్రాజెక్టు వెనక్కి వెళ్లిపోతుందేమో...
ఒక పెట్టుబడి మరో రాష్ట్రానికి వెళ్లిపోతుందేమో...
ఒక పేద కుటుంబానికి సాయం ఆలస్యమవుతుందేమో...
అందుకే చంద్రబాబు ఆగడం లేదు.
రాష్ట్రం కోసం ఆలోచిస్తున్నారు.
ప్రజల కోసం శ్రమిస్తున్నారు.
భవిష్యత్ తరాల కోసం ప్రణాళికలు వేస్తున్నారు.
ఈ రెండేళ్లు ఒక ప్రభుత్వ పాలనా కాలం మాత్రమే కాదు.
నిరాశ నుంచి నమ్మకానికి...
అనిశ్చితి నుంచి అభివృద్ధికి...
సమస్యల నుంచి పరిష్కారాల వైపు...
ఆంధ్రప్రదేశ్ సాగిస్తున్న పునర్నిర్మాణ ప్రయాణం.
ఆ ప్రయాణానికి ముందుండి దారిచూపుతున్న నాయకుడు-
నారా చంద్రబాబునాయుడు.
"నిద్రలేని శ్రమ... చెదరని సంకల్పం...
ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తే చంద్రబాబు లక్ష్యం."
హైటెక్ ఆంధ్ర

**శశికుమార్**
**తెలుగుదేశం సైనికుడు**



# పాడేరు కాఫీ హౌస్‌లో జడ్పీ కార్యాలయం




పాడేరు కాఫీ హౌస్‌లో జడ్పీ కార్యాలయం ఏర్పాటు కానుంది. కొత్త జిల్లాల వారీగా జిల్లా పరిషత్ కార్యాలయాల ఏర్పాటులో భాగంగా స్థానిక కాఫీ హౌస్‌లోనే ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేశారు. ప్రస్తుతం ఉన్న కాఫీ హౌస్‌లోని మీటింగ్ హాల్, నాలుగు గదులను వినియోగించుకోవడంతోపాటు అదనంగా అవసరమైన వసతిని సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. ఆయా పనులు చేపట్టేందుకు జిల్లాపరిషత్ నుంచి రూ. 20 లక్షలు విడుదలయ్యాయని ఉద్యోగులు అంటున్నారు. దీంతో అల్లూరి జిల్లాకు సంబంధించిన జడ్పీ కార్యాలయాన్ని కాఫీ హౌస్‌లో నిర్వహించేందుకు నిర్ణయం జరిగింది. గత 25 ఏళ్లుగా విశాఖపట్నం జిల్లాపరిషత్‌లో మన్యానికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 39 మండలాలుండగా.. వాటిలో 11 మండలాలు మన్యంలో ఉండడంతో గిరిజన జడ్పీటీసీ సభ్యుల మద్దతుతోనే ఎవరైనా జడ్పీ పీఠంపై అధ్యక్షుడి హోదాలో కూర్చొనేవారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో జడ్పీ ఎన్నికలు అనగానే అన్ని పార్టీలు ఏజెన్సీ వైపే చూసేవి. దీంతో జిల్లా పరిషత్‌లో మన్యానికి ఒక ప్రత్యేకమైన స్థానం సుస్థిరమైంది.

# కైలాసగిరికి అదనపు సౌకర్యాలు

విశాఖపట్నం (చైతన్యరథం): కైలాసగిరికి సందర్శకుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ప్రతిపాదించిన రెండో ఘాట్ రోడ్డు నిర్మాణంపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఆయన కైలాసగిరి, తొట్లకొండ ప్రాంతాలను అధికారులతో కలిసి సందర్శించారు. కైలాసగిరిపై ప్రతిపాదించిన అభివృద్ధి పనులన్నింటినీ అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఎనర్జీ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, దానికి తగిన స్థలం కేటాయించాలని సూచించారు. కొండపైకి ఒకే రహదారి ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నందున ప్రత్యామ్నాయంగా రెండో మార్గం అవసరమని, ఆ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. పర్యాటకులు విడిది చేసేందుకు చేపట్టిన నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడం గమనించి అధికారులను ప్రశ్నించారు. విశాఖలో పర్యాటకులకు అవసరమైనన్ని గదులు లేవని, మొత్తం 25 గదులు వచ్చేలా రిసార్ట్ నిర్మాణం ముందుకు తీసుకువెళ్లాలని ఆదేశించారు. నగరంలోని ప్రముఖ హోటళ్ల యజమానులతో చర్చించి, వారి సూచనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. కైలాసగిరిని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోవాలని, మాస్టర్ ప్లాన్ తయారుచేయాలని ఆదేశించారు. ఆ తరువాత తొట్లకొండకు వెళ్లి, అక్కడ వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేయాలని భావిస్తున్న స్థలాన్ని పరిశీలించారు. బీచ్‌రోడ్డును ఆనుకొని ప్రజలు, పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా ఉద్యానవనాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. వెంటనే ప్రతిపాదనలు పంపాలన్నారు. అక్కడి నుంచి వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేస్తున్న లేఅవుట్లను పరిశీలించారు. మౌలిక వసతులు, ప్రతిపాదిత పనులు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సెక్రటరీ మురళీకృష్ణ, ఈఓ దయానిధి, సీఈ వినయకుమార్, డీఎఫ్ఓ రమణమూర్తి, అదనపు కార్యదర్శి రిషిబాబు, ఏఓ వెంకటేశ్వరరావు, ఎస్ఈ రాంబాబు పాల్గొన్నారు.





## లంక శ్యామలరావుకు ఎంపీ కలిశెట్టి అభినందనలు

విజయనగరం (చైతన్యరథం): ఎచ్చెర్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నూతన ఇన్‌చార్జ్‌గా నియమితులైన లంక శ్యామలరావుకు విజయనగరం పార్లమెంటు సభ్యు కలిశెట్టి అప్పలనాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు, ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అందరూ నూతన ఇన్‌చార్జ్ లంక శ్యామలరావు నాయకత్వంలో ఐక్యంగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్తను కలుపుకుంటూ, ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్తూ ఎచ్చెర్ల నియోజకవర్గంలో టీడీపీ విజయ ప్రస్థానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆకాంక్షించారు.



## మహిళాభ్యున్నతికి మార్గదర్శి దుర్గాబాయి

శ్రీకాకుళం (చైతన్యరథం): మహిళాభ్యున్నతికి విశేష కృషి చేసిన దుర్గా భాయి దేశ్‌ముఖ్ మార్గదర్శి అని మాజీ మంత్రి, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ త్రిపురాన వెంకట రత్నం అన్నారు. స్వాతం త్ర్య సమరయోధురాలు దుర్గా భాయి దేశ్‌ముఖ్ విగ్రహాన్ని శాంతినగర్ కాలనీలోని సంఘ సంస్కర్తల స్మృతి వనంలో ఆవిష్కరించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో శ్రీకా కుళం జిల్లా నుంచి చేరి పోరాటం చేసి దేశ సేవ లో పాల్గొన్న లాలిశెట్టి అప్పారావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యా య అవార్డు గ్రహీత చౌదరి రాధాకృష్ణ, విగ్రహ దాతలను గాంధీ మందిర ప్రతినిధులు సత్కరిం చారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, వంశధార ఏఈ శివాజీ, మందిరం ప్రతినిధులు నిష్ఠల నరసింహమూర్తి, మహీబుల్లాఖాన్, నక్క శంకర రావు, గుత్తు చిన్నారావు, జామి భీమశంకర్, ఎంవీవీఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# టీచర్లకు ఘన సన్మానం.. పాఠశాలకు మినీ సౌండ్ సిస్టమ్ !

### కార్యక్రమాన్ని చేపట్టిన శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు




రాజమహేంద్రవరం (చైతన్యరథం): స్థానిక మూడో వార్డు నెహ్రూ నగర్‌లోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను స్మరించుకుంటూ పాఠశాల ఉపాధ్యాయులను రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు స్వీట్ బాక్సులు అందజేయగా, విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు, కూల్‌డ్రింక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించి పలు సంస్కరణలు చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, డిజిటల్ విద్య, సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు చేరువ చేయడం వంటి అంశాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌సేవలను గౌరవిస్తూ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆయనకు మనమిచ్చే గౌరవానికి ప్రతీక అన్నారు. విద్యార్థుల్లో జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల విద్యలో ఉన్నతంగా రాణించేందుకు ప్రేరణ కల్పించాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. పాఠశాల కార్యక్రమాల నిర్వహణలో సౌండ్ సిస్టమ్ అవసరం ఉందని ఉపాధ్యాయులు సత్తిబాబు దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన మినీ సౌండ్ సిస్టమ్‌ను కొనుగోలు చేసి పాఠశాలకు బహూకరించారు. తక్షణమే స్పందించి సౌండ్ సిస్టమ్ అందించడం పట్ల ఉపాధ్యాయులు సత్తిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.



### చైనా మాస్టర్స్ టైటిల్ విజేతలకు
## ఎంపీ సానా సతీష్ అభినందనలు

కాకినాడ (చైతన్యరథం): చైనా మాస్టర్స్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టైటిల్‌ను సాధించిన భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టికి రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన సాత్విక్ సాయిరాజ్ మరోసారి ప్రపంచ స్థాయిలో భారత కీర్తిని చాటడం గర్వకారణమని ఎంపీ పేర్కొన్నారు. అద్భుతమైన పోరాట స్ఫూర్తితో సాత్విక్ చిరాగ్ జోడీ 21-13, 21-17తో వరుసగా రెండు గేమ్‌లు గెలిచి టైటిల్‌ను కైవసం చేసుకోవడం ప్రశంసనీయమన్నారు. 2026లో సాత్విక్, చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్ కావడం వారి అద్భుతమైన ఫామ్‌కు నిదర్శనమని సానా సతీష్ బాబు అన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

### టీడీపీ కండువా కప్పి ఆహ్వానించిన రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి



రాజానగరం (చైతన్యరథం): నియోజకవర్గం, సీతానగరం మండలం, మునికూడలి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రుడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై అన్ని వర్గాల ప్రజలు టీడీపీ వైపు వస్తున్నారని అన్నారు. రాజానగరం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత గౌరవం కల్పిస్తూ, టీడీపీ కుటుంబంలో భాగస్వాములను చేస్తామని బొడ్డు వెంకటరమణ చౌదరి గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కష్టాల్లో కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ



### పరామర్శించిన డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్

రాజమహేంద్రవరం రూరల్ (చైతన్యరథం): నియోజకవర్గం, కడియం మండలం దుళ్ల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ కార్యకర్తలను టీడీపీ యువ నాయకులు, ఆరోగ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ ఆదివారం వారి స్వగృహాలకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అనుపోజు శ్రీనివాస్ గత మూడు సంవత్సరాలుగా పక్షవాతం (పెరాలసిస్ స్ట్రోక్)తో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారని, ప్రస్తుతం ఆయనకు ఎలాంటి పెన్షన్ అందడం లేదని తెలుసుకున్నారు. అదేవిధంగా అలక పెద వెంకటరావు కూడా గత మూడు సంవత్సరాలుగా పక్షవాతం కారణంగా మంచానికే పరిమితమై ఉన్నారని, ప్రస్తుతం ఆయనకు రూ.నాలుగు వేల రూపాయలు వృద్ధాప్య పెన్షన్ అందుతున్నట్లు తెలుసుకున్నారు.ఇద్దరి ఆరోగ్య పరిస్థితి, వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్న డా. గోరంట్ల రవిరామ్ కిరణ్ వారికి ధైర్యం చెప్పారు. వారి సమస్యలను రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి గారి దృష్టికి తీసుకెళ్లి,సాధ్యమైన సహాయం అందేలా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.టీడీపీ కార్యకర్తలు పార్టీకి వెన్నెముకలాంటివారని, కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చినా టీడీపీ కుటుంబం ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని రవిరామ్ కిరణ్ పేర్కొన్నారు.



## కష్టాల్లో ఉన్నవారికి సాయం చేయడమే లక్ష్యం

### తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు బొండా రవితేజ

విజయవాడ సెంట్రల్ (చైతన్యరథం): నియోజకవర్గంలోని 30వ డివిజన్ మధ్యకట్టలో రాళ్లపాటి కుసుమకు రూ. 5,000, 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో సాయి. త్రిలోక్‌కు రూ. 10,000 ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు సూచన మేరకు ప్రతినెల తన సొంత నిధుల నుండి వికలాంగులకు అందించే పెన్షన్ నగదును స్వయంగా వారి ఇంటి వద్దకే వెళ్లి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా రవితేజ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బొండా రవితేజ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం అనేది కేవలం పదవుల్లో ఉన్నప్పుడే చేసే కార్యక్రమం కాదని, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవ అని అన్నారు. ముఖ్యంగా వికలాంగులు తమ దైనందిన జీవితంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటారని, వారికి ఆర్థికంగా కొంత భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి నెలా తన సొంత నిధుల నుంచి పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. వికలాంగులు తమ అవసరాల కోసం ఎవరి ముందు చేయి చాచకూడదనే ఉద్దేశంతో వారికి వీలైనంత సహాయం అందిస్తున్నామని చెప్పారు. వారి ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ అందించడం ద్వారా వారికి ఆర్థిక సహాయంతో పాటు మనోధైర్యాన్ని కూడా కల్పించాలన్నదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారి సమస్యలను గుర్తించి సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని బొండా రవితేజ గారు తెలిపారు. ప్రజల కష్టాలను తమ కష్టాలుగా భావించి, వారి కన్నీటిని తుడవడం, అవసరమైన సమయంలో అండగా నిలవడం తమ కుటుంబానికి అలవాటుగా మారిందని అన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సూచనలతో నియోజకవర్గంలో ప్రజా సంక్షేమానికి సంబంధించిన అనేక కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. పేద ప్రజలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు ప్రోత్సాహం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సహాయం, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ప్రజల నుంచి వచ్చే అభిమానం, ఆశీర్వాదాలే తమకు మరింత సేవ చేయడానికి ప్రేరణనిస్తాయని బొండా రవితేజ అన్నారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యల్లో తోడుగా నిలిచి, అవసరమైన సమయంలో అండగా ఉండటమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.వికలాంగులు, పేద కుటుంబాలు తమకు ఏ సమస్య వచ్చినా సంకోచించకుండా తమ దృష్టికి తీసుకురావాలని, సాధ్యమైన ప్రతి విషయంలో వారికి అండగా ఉంటామని బొండా రవితేజ భరోసా ఇచ్చారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో:- 32వ డివిజన్ అధ్యక్షులు బొలిశెట్టి శేషుబాబు, 32వ డివిజన్ ఇంచార్జ్ వెలగా సురేష్,సెంట్రల్ నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షులు గరిమెళ్ల చిన్న, 30వ డివిజన్ అధ్యక్షులు లక్కం రాజు శ్రీనివాస్ రాజు, ఇంచార్జ్ కర్ణం వెంకటరమణ, భద్రం, లక్ష్మీ శెట్టి సాయి, తదితరులు పాల్గొన్నారు.



## సీఎం చంద్రబాబుకు జైకొడుతూ టీడీపీలోకి 250 మంది

### పసుపు కండువా కప్పి ఆహ్వానించిన. నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాజమహేంద్రవరం నగరంలోని ఒకటో వార్డు లాలాచెరువు సెంటర్ వద్ద రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమక్షంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో 250 మందికి పైగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు టీడీపీలో చేరుతున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీకి క్రమశిక్షణ, సిద్ధాంతం, ప్రజల పట్ల నిబద్ధత ఉన్నాయని పేర్కొన్నారు. పార్టీలోకి కొత్తగా చేరిన ప్రతి ఒక్కరినీ సముచితంగా గౌరవిస్తూ, సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకత్వంపై నమ్మకంతో, కూటమి ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. రాష్ట్రంలో టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం మేరకు నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సహకారంతో టిడిపి అభివృద్ధి కార్యక్రమాలను సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు, కాశీ నవీన్ కుమార్, ఉప్పులూరి జానకిరామయ్య, వర్రే శ్రీనివాసరావు, బుడ్డిగ రవి, ద్వారా పార్వతిసుందరి, యిన్నమూరి దీపు, మరుకుర్తి రవి యాదవ్, చింతపల్లి నాని, హరి బెనర్జీ అధిక సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలనలోనే పట్టణాల అభివృద్ధి

## చిలకలూరిపేట శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట (చైతన్యరథం): పట్టణాభివృద్ధిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టామని, దానిలో భాగంగా ఇటీవల ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.52 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, నేడు పలువార్డుల్లో రూ.1.04 కోట్ల మైనింగ్ నిధులతో నిర్మించనున్న సీసీరోడ్లకు శంకుస్థాపన చేయడం జరిగిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. పట్టణాభివృద్ధిలో భాగంగా ఆదివారం ఆయన నాలుగు వార్డుల్లో రూ.1.04 కోట్లతో నిర్మించనున్న సీసీరోడ్లకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా వార్డుల్లో ప్రత్తిపాటి టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తెలుగుదేశం నిర్వహించారు. అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు. చిలకలూరిపేట పట్టణ రూపురేఖలు మార్చే దిశగా నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, కోటి 4 లక్షల మైనింగ్ నిధులతో, 9, 18, 21, 23 వార్డుల్లో నిర్మించే ప్రధాన సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశామని ప్రత్తిపాటి చెప్పారు. ఇటీవల ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.52 కోట్ల ప్రత్యేక నిధులతో చేపట్టబోయే పనులకు ఇప్పటికే టెండర్లు పిలవడం జరిగిందన్నారు. ఈ నిధులతో ప్రధానంగా సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి చేపట్టనున్నట్టు ఆయన చెప్పారు. ఈ పనులన్నీ పూర్తయితే పట్టణంలో ఎక్కడా ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. పనిచేసే ప్రభుత్వంలో పట్టణాలు ఎలా అభివృద్ధి చెందుతున్నాయో ప్రజలు గమనించాలని ప్రత్తిపాటి కోరారు. పట్టణ ప్రజలే రాష్ట్ర అధికార నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారని, వారు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ పెట్టిందని ప్రత్తిపాటి చెప్పారు.

రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన నాయకుడు చంద్రబాబు మాత్రమేనని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాయని ప్రత్తిపాటి చెప్పారు. గత ప్రభుత్వంలో పట్టణాలు సమస్యల కూపాలుగా మారాయని, చివరకు చెత్తసేకరణ కూడా సక్రమంగా జరగలేదన్నారు. జగన్ పాలనలో పట్టణాల్లో నివసించే పేద, మధ్య తరగతి వర్గాలకు ఉపాధి కూడా దొరకలేదని, రోజువారీ కూలీలు అర్థాకలితో అలమటించారని ప్రత్తిపాటి తెలిపారు. పట్టణ ప్రజలపై పన్నులభారం మోపి, ఖజానా నింపుకున్న జగన్.. వారి సమస్యల్ని మాత్రం గాలికి వదిలేశాడన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, టీడీపీ నాయకులు సయ్యద్ వహాబ్, మారెళ్ల అప్పారావు, అరెకతల కోటేశ్వరరావు, కరిముల్లా, ఎస్.ఎస్. సుభాని, మద్దిబోయిన చంద్రశేఖర్, ముల్లా కరిముల్లా, ఒంటిపులి వెంకట, గోపిదేశి వెంకటేశ్వర్లు, మామిళ్ల దాసు, ఫ్రాన్సిస్, మండవ వెంకట్రావు, శిఖా నాగరాజు, కొత్త కోటేశ్వరరావు, సిల్వర్ హరి, అర్వపల్లి అప్పారావు, కనమర్లపూడి రమేష్, రాచుమల్లు సూర్య రావు, కంచర్ల శ్రీనివాసరావు, మోహన్ కృష్ణ, కంచర్ల కరుణ, బొల్లయ్య, బీజేపీ నాయకులు గట్టా హేమ, డి.ఈ అబ్దుల్ రహీమ్, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో సాంస్కృతిక కళలకు ప్రోత్సాహం

## కాసుల పురుషోత్తమ కవి జయంతి ఉత్సవాల్లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): భారత దేశ సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షించేందుకు, తెలుగు భాషను వ్యాప్తి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృత నిశ్చయంతో పాటుపడతారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం స్థానిక విజ్ఞాన మందిరంలో కాసుల పురుషోత్తమ కవి జయంతి మహోత్సవాలకు ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కాసుల పురుషోత్తమ కవి ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో చేపట్టిన ఈ కార్యక్రం మూడు రోజులుగా కొనసాగుతోంది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాజుల అతిశయాన్ని రాజసంతో నిలదీసిన గొప్ప కవి కాసుల పురుషోత్తములని కొనియాడారు. డాక్టర్ కాసుల కృష్ణంరాజు మిమిక్రీ ఆర్టిస్టుగానే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అత్యంత మక్కువ కలిగి ఉన్నారని తెలిపారు. ఎన్నో ప్రాంతాల నుంచి కళాకారులు ఇక్కడకు వచ్చినందుకు అభినందనలు చెప్పారు. బుర్రకథ, హరికథ, తప్పెటగుళ్ళు, కోలాటం వంటి అంతరించిపోతున్న జానపద కళారూపాలను ఆదరించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సాంప్రదాయ కళలైన కూచిపూడి, కర్ణాటక సంగీతం, తోలుబొమ్మలాట వంటి ప్రక్రియలను రక్షించడానికి ప్రభుత్వ సంగీత-నృత్య కళాశాలల ద్వారా శిక్షణ అందిస్తోందని చెప్పారు.



# పేదల ఆరోగ్యానికి అండగా అనుమోలు ట్రస్ట్

## పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అభినందనలు

పెనమలూరు (చైతన్యరథం): పేదల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా అనుమోలు ఆదరణ ట్రస్ట్ ఆధ్వర్యంలో పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించడం అభినందనీయమని పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు బోడే ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్యాంపులో పాల్గొన్న పేదలకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన బీపీ, షుగర్, కంటి పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు తదితర వైద్య సేవలు అందించారు,వైద్యుల సూచనల మేరకు అవసరమైన మందులను నెలకు సరిపడా ఉచితంగా పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో నెలనెలా మందుల కోసం అయ్యే ఖర్చు భారంగా మారుతుందని,అలాంటి వారికి ఈ సేవా కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు. ప్రతి నెలా ఉచితంగా మందులు అందించడం ద్వారా పేదలకు వేలాది రూపాయల ఆర్థిక భారం తగ్గడంతో పాటు,ఆరోగ్యపరమైన భరోసా లభిస్తుందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న అనుమోలు చారిటబుల్ ట్రస్ట్ అధినేత ప్రభాకరరావుని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.

# మట్టి విగ్రహాలను పూజిద్దాం... పర్యావరణాన్ని కాపాడుదాం!

## గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపు

గుంటూరు (చైతన్యరథం): వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రజలకు పిలుపునిచ్చారు. కొణిదె మోహన్ గోపి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన బ్రోచర్‌ను, మట్టి వినాయక విగ్రహ ప్రతిమను ఎమ్మెల్యే గల్లా మాధవి ఆవిష్కరించారు. సందర్భంగా గల్లా మాధవి మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని, వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించాలని కోరారు. సంప్రదాయాలను కాపాడుకుంటూనే ప్రకృతిని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పరుచూరి సంజీవరావు, టీడీపీ తెలుగు యువత నాయకులు వంశీ, కిషోర్, ఆనంద్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



# నరసింహకొండ అభివృద్ధికి మరిన్ని నిధులు

## రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి, కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోటంరెడ్డి





నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో 8 కోట్ల 75 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శంకుస్థాపన చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ పాల్గొన్నారు. శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి వెల్లడించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఆలయ ప్రాంగణాన్ని మరింత ఆధ్యాత్మికంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.8 కోట్ల 75 లక్షలతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తున్నామన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇంత మంచి కార్యక్రమంలో భాగస్వాములు చేసినందుకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి , తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని అత్యంత ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఒకటి. ఈ దేవస్థానం అభివృద్ధికి రూ.8 కోట్ల 75 లక్షలు మంజూరు చేసి, నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం నియోజకవర్గ ప్రజలకు, భక్తులకు ఎంతో ఆనందాన్ని కలిగించే విషయమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆలయ పరిసరాల అభివృద్ధి, ఇతర వసతులను మెరుగుపరచడమే తమ లక్ష్యమన్నారు.

శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆశీస్సులతో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు నియోజకవర్గంలో దేవాదాయ శాఖ ద్వారా దేవాలయాలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను 13కోట్ల 45 లక్షల రూపాయలు కేటాయించామన్నారు. పై కార్యక్రమంలో శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, టీడీపీ నాయకులు ఆనం రంగ మయూర్ రెడ్డి, గిరి నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, మలినేని వెంకయ్య నాయుడు, నగర మాజీ మేయర్ నందిమండలం భాను శ్రీ, మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయకుమార్, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ అల్లాబాక్షు, మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, క్లస్టర్ ఇంచార్జ్ జలదంకి సుధాకర్, బిజెపి జిల్లా అధ్యక్షులు శీపా రెడ్డి వంశీధర్ రెడ్డి, బిజెపి నాయకులు ఈశ్వరయ్య, జనసేన నాయకులు దుగ్గిశెట్టి సుజయ్ బాబు, కాకు మురళి రెడ్డి, అలియా, శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కమిటీ సభ్యులు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇంచార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇంచార్జ్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చిరెడ్డిపాళెంలో మరింత అభివృద్ధి చేసి చూపిస్తాం

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హామీ



కోవూరు (చైతన్యరథం): త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బుచ్చిరెడ్డిపాళెంలో ఆదివారం స్థానిక కూటమి నాయకులతో కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహం, వార్డుల వారీగా పార్టీ బలోపేతం, ప్రజలతో మమేకం కావడం, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడం వంటి అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. త్వరలో స్థానిక ఎన్నికలు జరగబోతున్నాయని, అందరూ ఐక్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. 'మీ అందరి కోసం 28 వార్డులు చేయించాను. రిజర్వేషన్ల ప్రకారం ఏ వార్డులో ఎవరైతే అభ్యర్థిగా నిలబడతారో.. మిగిలిన వారందరూ వారికి తప్పకుండా సహకరించాలి. మనలో ఎలాంటి విభేదాలు ఉండకూడదు. కూటమి అభ్యర్థుల విజయమే మనందరి లక్ష్యం కావాలి' అని అన్నారు. ఎవరికి కౌన్సిలర్ అవకాశం రాలేదని నిరాశ చెందవద్దని, ప్రజలకు సేవ చేసే ప్రతి ఒక్కరూ నాయకులేనని స్పష్టం చేశారు. 'ఎవరికి ఏదైనా అసంతృప్తి ఉంటే నా దగ్గరకు నేరుగా వచ్చి మాట్లాడండి. మనమంతా కలిసి పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి' అని సూచించారు. 'మనం చేసే రాజకీయాల్లో అసత్యాలు, అబద్ధాలు ఉండనే ఉండవు. నీతి, నిజాయతీతో రాజకీయాలు చేస్తాం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు అవినీతి రహిత కోవూరు నియోజకవర్గాన్ని అందించాం. అదే విధంగా వివాద రహిత నియోజకవర్గాన్ని కూడా అందిస్తామని చెప్పాం. అయితే ప్రస్తుతం వివాదాల కోవూరునే పరిపాలిస్తున్నాం. మరీ ఏదైనా శృతిమించి పోయినప్పుడు మాత్రం ఎవరికైనా శిక్ష తప్పదు' అని ఎమ్మెల్యే గారు అన్నారు. రాజకీయాల్లో ఉంటే అనుచిత వ్యాఖ్యలు, ఆరోపణలు ఎదురవుతుంటాయని, వాటన్నింటికీ స్పందిస్తూ సమయం వృథా చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. 'ఏనుగు వెళ్తుంటే వంద కుక్కలు మొరుగుతుంటాయి. అలాంటి వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం మనకు లేదు. ప్రజలకు సేవ చేయడం ఒక్కటే మన లక్ష్యం. మన పని మనం చేసుకుంటూ ముందుకు వెళ్లాలి' అని అన్నారు. పంచాయతీలను పరిశీలించినా, వార్డుల్లో పర్యటించినా నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు తెలిపారు. 'కేవలం ప్రభుత్వ నిధులతోనే కాకుండా సొంత నిధులు, దాతల సహకారంతో కూడా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. నాకు తెలిసినంత వరకు కోవూరు చరిత్రలో ఇంత అభివృద్ధి గతంలో ఎప్పుడూ జరగలేదు. మనం చేస్తున్న సేవలను చూసి స్ఫూర్తి పొంది ఎంతో మంది దాతలు ముందుకొచ్చి అభివృద్ధిలో భాగస్వాములు కావడం కూడా గతంలో ఎన్నడూ జరగలేదు' అని అన్నారు. 'ప్రజలు రెండేళ్లలో మన పనితీరును చూశారు. రాబోయే మూడేళ్లలో అంతకంటే ఎక్కువ కష్టపడి పనిచేస్తాం. మనపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలి' అని నాయకులకు సూచించారు.

**వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు**

ఈ సందర్భంగా వైసీపీ నాయకులు అల్లం శ్రీనయ్యతో పాటు ఆయన అనుచరులు మరో 10 మంది ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారి పనితీరుపై విశ్వాసంతో పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.

# బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ విజేతలకు అవార్డులు

## పాల్గొన్న కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

అల్లూరు (చైతన్యరథం): క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి మాత్రమే కాకుండా జీవితంలో క్రమశిక్షణ, పట్టుదలను నేర్పిస్తాయని, గ్రామీణ ప్రాంతాల్లో దాగున్న అద్భుతమైన క్రీడా ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ స్థాయికి చేర్చడమే మన అందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో అల్లూరులోని రామకృష్ణ జూనియర్, డిగ్రీ కాలేజ్ వేదికగా జరిగిన “ఆంధ్రప్రదేశ్ 12వ సీనియర్ స్త్రీ, పురుషుల అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్--2026” పోటీలు ఆదివారం ముగిశాయి. తేదీ 04-09-2026 నుండి 06-09-2026 వరకు మూడు రోజుల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోటీల ముగింపు సభకు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు ట్రోఫీలు, మెమొంటోలు మరియు అవార్డులను ప్రదానం చేశారు.?ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి క్రీడాకారులను ఉద్దేశించి అత్యంత స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు:?క్రీడా స్ఫూర్తి ప్రధానం: “క్రీడల్లో గెలుపోటములు నాణేనికి బొమ్మ అరుసు లాంటివి. గెలిచిన వారు విర్రవీగకుండా, రన్నరప్‌గా నిలిచిన వారు నిరాశ చెందకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలి. మైదానంలో చూపించే పట్టుదలే మిమ్మల్ని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు తీసుకెళ్తుంది.”మైదానంలో క్రీడాకారులు ప్రదర్శించే క్రమశిక్షణ, సమయపాలన మరియు సమష్టి తత్వం (ఁముఎ ఔశీతీఎ) నేటి యువతకు ఎంతో ఆదర్శనీయమని ప్రశంసించారు. మన రాష్ట్ర క్రీడాకారులు కేవలం ఇక్కడికే పరిమితం కాకుండా, జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని దేశానికి, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల ఎదుగుదలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు.



# సాగునీటి అవసరాలకే కేసీ నీరు



చాగలమర్రి (చైతన్యరథం): కేసీ ప్రధాన కాలువకు అధికారులు నీటిని విడుదల చేశారు. డీఈ పుల్లయ్య, ఏఈ జమాల్‌వలి కేసీ కాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. సంతజూటూరు నుంచి కుందూనదికి నీరు వదిలారని, తాగునీటి అవసరాలకేనని వెల్లడించారు. రైతులు వరి సాగు చేయరాదని, ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూపర్‌వైజర్ దస్తగిరి, లస్కర్లు ఉన్నారు. రాజోలి ఆనకట్టకు కృష్ణాజలాలు చేరడంతో నీరు పొంగి ప్రవహించింది. 'కుందూ నువ్వెక్కడ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈనెల 4న కథనం ప్రచురిరతమైంది. ఇందుకు స్పందించిన పాలకులు, అధికారులు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి కుందూకు నీరు విడుదల చేయడంతో ఆనకట్టకు చేరింది. దాదాపు వెయ్యి క్యూసెక్కుల నీరు చేరినట్లు కేసీకెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఈ నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని రైతులు వరి సాగు చేయవద్దని సూచించారు.



## మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

### చీరాల శాసనసభ్యుడు మద్దులూరి మాలకొండయ్య వెల్లడి

చీరాల (చైతన్యరథం): పట్టణంలోని 23 వ వార్డు యానాది సంఘం జాలమ్మ వాటర్ ట్యాంక్ సమీపంలోని 15 వ ఆర్థిక సంఘం నిధుల నుండి సిమెంట్ రోడ్డు నిర్మాణం ం మురుగు కాల్వ నిర్మాణానికి చీరాల మున్సిపాలిటీ 26వ వార్డులో మున్నా చర్చ్ విఠల్ నగర్ నందు 15 వ ఆర్థిక సంఘం నిధులతో 11 లక్షల 80వేల రూపాయల వ్యయంతో మురుగు కాలువ నిర్మాణం పనులకు చీరాల శాసనసభ్యుడు మద్దులూరి మాలకొండయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చీరాల శాసనసభ్యుడు మద్దులూరి మాలకొండయ్య మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణంతో ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడతాయని అన్నారు. ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి చీరాల పట్టణాన్ని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

## బాధితురాలికి అండగా కావలి ఎమ్మెల్యే కావ్య



అల్లూరు (చైతన్యరథం): అల్లూరు మండలం, పురిణి పంచాయతీ పరిధిలోని తుఫాన్ నగర్‌లో ఇటీవల అళ్లపాక నిర్మల గారి నివాసంలో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది.

ఈ విషయాన్ని తెలుసుకున్న కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి ఆదివారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి ప్రమాద స్థలానికి చేరుకుని, కాలిపోయిన ఇంటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "బాధిత కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటాం" అని హామీ ఇచ్చారు.?అనంతరం, నిర్మల గారు వెంటనే ఇల్లు నిర్మించుకోవడానికి సహాయపడేలా వారికి ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే గారి వెంట అల్లూరు మండల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గురువులను గౌరవించడం మా తల్లిదండ్రులు నేర్పిన సంస్కారం

### 20మంది విశ్రాంత ఉపాధ్యాయులను పట్టువస్త్రాలు, శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం (చైతన్యరథం): గురువులను గౌరవించడం మా తల్లిదండ్రుల నుంచే మాకు వచ్చిందని అలాంటిది నేడు ఇంతమంది గురువులను గౌరవించి వారికి పట్టువస్త్రాలు అందించడం నా అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 218వ జయంతి సందర్భంగా నిర్వహించుకునే ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అంగరంగ వైభవంగా నిర్వహించి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల ఉపాధయులను వారి దంపతులను దాదాపు 2650 మందికి పట్టువస్త్రాలు అందించగా 20 మంది విశ్రాంత ఉపాధ్యాయులకు పట్టువస్త్రాలు, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి వేలమంది ఉపాధ్యాయ కుటుంబాలతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు తరలివచ్చారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ ఏ విద్యార్థి అయిన మంచి విద్యను అభ్యసించి అత్యున్నత స్థాయి ఐఏఎస్, ఐపీఎస్ లతో పాటు ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు గురువులు అందించే అత్యుత్తమ విద్యా బోధన, గురువులు అందించే వ్యక్తిత్వమే వారికి మార్గదర్శనం అవుతాయని, అలాంటి గురువులకు విద్యా శాఖమంత్రి నారా లోకేష్ ఉన్నత స్థాయి అందించారని, కేవలం 45 రోజుల్లోనే ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయం చేసుకుని ఎలాంటి వివాదాలు కానీ కోర్టు కేసులు కానీ లేకుండా 16,500 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత ఆయనకే దక్కిందని కళ్యాణదుర్గం ప్రాంతంలో కూడా ఎంతో మంది పేద విద్యార్థులకు కోచింగ్ తీసుకోవాలంటే ఇబ్బంది పడతారనే ఉద్దేశ్యంతోనే 1200 విద్యార్థులకు ఉచిత కోచింగ్, మెటీరియల్‌తో పాటు భోజన వసతి కూడా కల్పించామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఉపాధ్యాయుల పట్ల ఉన్న గౌరవంతో ప్రతి సారి పీఆర్సీ, డీఏలు అందించారని అందులో భాగంగానే ఉద్యోగ సంఘాల నాయకులతో జరిపిన చర్చలు కూడా సఫలం అవడంతో నేడు ఉపాధ్యాయులకు వచ్చే నెల అక్టోబర్ 1న 2డీఏలు, 12వ పీఆర్సీ ఏర్పాటుకు అంగీకారం తెలిపిందన్నారు. ప్రస్తుతం 37.31 శాతం డీఏ ఇస్తుండగా రాబోయే రెండు డీఏలతో అది 40.04 శాతం కానుందని, పెంచిన ప్రతి సారి చంద్రబాబు నాయుడే పెంచారు తప్ప మరొకరు పెంచలేదని అది ఉపాధ్యాయుల పట్ల ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధి అని పేర్కొన్నారు. చుక్క నీరు కూడా దొరకని ప్రకాశం జిల్లాకు వెలిగొండ ప్రాజెక్టు 5300కోట్లు ఖర్చు చేసి నీటిని అందించిన అపర భగీరథుడు చంద్రబాబు నాయుడని ఆయనకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోడుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా కళ్యాణదుర్గం ప్రాంతం గురించి కూడా చంద్రబాబు నాయుడుకు పూర్తిగా తెలుసని అందువల్లే బీటీపీ ప్రాజెక్టును 2028 నాటికి పూర్తి చేస్తామని ఇరిగేషన్ క్యాలెండర్ కూడా ఇచ్చారని తెలిపారు.. తాను ఈ కార్యక్రమం ఏదో ఎన్నికల కోసమో మరొక దానికోసమో చేయడం లేదని, మన ప్రాంతం చాలా పేద ప్రాంతం అలాంటి ప్రాంతానికి ఉపాధ్యాయుల సేవలు కూడా అవసరమని గుర్తించి మీ సేవలు, మీ సహకారం ఎప్పుడు ఉండాలనే చేస్తున్నాన్రని ఎస్సార్సీ ట్రస్ట్‌లో తాను ఒక సభ్యుడు చైర్మన్ రాజగోపాల్, వెంకటేష్, మహీధర్, యశ్వంత్‌తో పాటు 7000 మంది కష్టంతోనే ఇంత పెద్ద ఎత్తున విద్యార్థులకు కానుకగా 5 కోట్ల రూపాయలతో 7300 సైకిళ్లు అందిస్తున్నామన్నారు. సైకిళ్లు తీసుకున్న విద్యార్థుల ఆనందం చూస్తుంటే చాలా సంతోషం వేస్తోందని అన్నారు. టెట్ గురించి చూసుకోవడానికి మా యువ నాయకులు నారా లోకేష్ చూస్తారాని మేము కూడా మిమ్మల్ని దృష్టిలో ఉంచుకుని ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి, మంత్రి దృష్టికి తీసుకెళతామని తెలిపారు. అలాగే ఈ పాఠశాలలో కూడా సరైన భవనాలు కానీ, టాయిలెట్లు కానీ లేవని ఒక్కొక్కటి అభివృద్ధి చేసేందుకు కొంచెం సమయం పడుతుందని, శెట్టూరు ఎస్సీ హాస్టల్‌లో గోడ కూలి విద్యార్థి మరణించడం బాధాకరమన్నారు. అలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు..

## నాట్స్ షికాగో కార్యవర్గం

### చైర్మన్‌గా కిషోర్ కంచర్ల, అధ్యక్షుడిగా రాజ్ అల్లాడ

అమెరికా: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) షికాగో చాప్టర్ నూతన కార్యవర్గాన్ని 2026-2028 సంవత్సరానికి ఎన్నుకున్నట్లు ప్రకటించింది. ఈ నూతన బృందానికి నాట్స్ చైర్మన్‌గా కిషోర్ కంచర్ల, అధ్యక్షుడిగా రాజ్ అల్లాడ వ్యవహరించనున్నారు. అలాగే షికాగో చాప్టర్ లీడ్‌గా నరేంద్ర కడియాల బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు నాట్స్ షికాగో చాప్టర్ టీమ్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల పూర్తి వివరాలు వెల్లడయ్యాయి.

**షికాగో చాప్టర్ సభ్యులు**

షికాగో చాప్టర్ సభ్యులుగా అంజయ్య వేలూరి, మహేష్ కిలారు, ప్రతిభ వట్టికూటి, దివ్యశ్రీ వేముల, సతీష్ త్రిపురనేని, చెన్నయ్య కంబాల, వరుణ్‌కుమార్ రెడ్డి గడ్డం, నాగరాజ్ మేడ, భానుచందర్ కీర్తి, అలాగే సుబ్బరాయుడు చావడం కొనసాగనున్నారు. అలాగే, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, ఎగ్జిక్యూటివ్ కమిటీ విభాగాలకు సంబంధించి శ్రీనివాస్ బొప్పన, శ్రీరామ్ కొప్పాక, శేషు మరంరెడ్డి, మదన్ పాములపాటి, వీర తక్కెళ్ళపాటి వివిధ కీలక బాధ్యతల్లో నియామకమయ్యారు.




# తెలుగోడి సేవలకు గౌరవం

- కృష్ణప్రసాద్ సోంపల్లికి మసాచుసెట్స్ స్టేట్‌హౌస్ సన్మానం
- సామాజిక సేవలకు గుర్తింపుగా ప్రశంసాపత్రం



అమెరికా: సమాజ సేవే లక్ష్యంగా నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తూ అనేక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) నాయకుడు కృష్ణప్రసాద్ సోంపల్లిని మసాచుసెట్స్ రాష్ట్ర స్టేట్ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ ప్రత్యేక ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించింది. కమ్యూనిటీకి ఆయన చేస్తున్న సేవ, అంకితభావం, సేవా తత్పరత, వలంటీర్‌గా ఆయన చేస్తున్న ఇతర కార్యక్రమాలను గుర్తిస్తూ ఈ ప్రశంసా పత్రాన్ని మసాచుసెట్స్ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ స్పీకర్ రొనాల్డ్ మరియానో తరపున మసాచుసెట్స్ స్టేట్ హౌస్‌లో స్టేట్ రిప్రజెంటేటివ్ జెఫ్ రాయ్ అందజేశారు. ప్రశంసాపత్రంలో సోంపల్లి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు అనేక మంది వ్యక్తులు, కుటుంబాలపై సానుకూల ప్రభావాన్ని చూపాయని పేర్కొన్నారు. కృష్ణప్రసాద్ సోంపల్లి ఎన్నో సంవత్సరాలుగా వివిధ సామాజిక, సేవా కార్యక్రమాల్లో తన వంతు సహకారం అందిస్తున్నారు. విద్యార్థులకు, పాఠశాలలకు సహాయం చేయడం, అవసరమైన వారికి నిత్యావసర వస్తువులు అందించడం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, యువత కోసం కార్యక్రమాలు చేపట్టడం, చారిటీ, సాంస్కృతిక కార్యక్రమాలకు సహకరించడం వంటి అనేక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. "మనకు ఉన్న దానిలో కొంత భాగాన్ని సమాజానికి తిరిగి ఇవ్వడం ప్రతిఒక్కరి బాధ్యత. ఒక చిన్న సహాయం కూడా ఒకరి జీవితంలో పెద్ద మార్పును తీసుకురాగలదు. ఈ గుర్తింపు నాకు మరింత సేవ చేయాలనే బాధ్యతను పెంచింది" అని కృష్ణప్రసాద్ సోంపల్లి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ఎన్నో సేవా కార్యక్రమాలు**

అమెరికాతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలను చేశారు. 12కు పైగా సీపీఆర్ ఈవెంట్లు, చలివేంద్రాల ఏర్పాటు, అన్నదానాలతో పాటు అవసరమైన వారికి తనవంతుగా ఎప్పటికప్పుడు ఆర్థిక సహాయం అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటారు. తెలుగు రాష్ట్రాల్లో తానా ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాల ను చేస్తూనే ఉంది. దేశానికి పేరు తీసుకువచ్చిన క్రీడాకారులను అభినందించడంతో పాటు వారికి తానా తరపున మెమోంటోలను అందిస్తున్నారు.

**పౌరాణిక నాటకాల్లోనూ కళా ప్రతిభ**

అమెరికాలో పౌరాణిక నాటకాలు వేయడంలోనూ ముఖ్యంగా సుయోధనుని పాత్రలో మెప్పించడం సోంపల్లికి సాధ్యమని అంటారు. తన కళా ప్రతిభతో ఎంతోమందిని మంత్రముగ్ధులను చేశారు. ఆయన భావోద్వేగం, భాషాపటిమ ఆ పాత్రకు జీవం పోస్తాయని అభిమానులు అంటారు. అటు కళా ప్రతిభతోనూ, ఇటు సేవా కార్యక్రమాలతోనూ సోంపల్లి అందరికీ చేరవవుతున్నారు. ఈ సందర్భంగా తన సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న వాలంటీర్లు, మిత్రులు, కమ్యూనిటీ నాయకులు, తానా సంస్థ, కుటుంబసభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన సేవలను గుర్తించి ప్రశంసా పత్రం అందించిన స్పీకర్ రొనాల్డ్ మరియానోకి, స్టేట్ రిప్రజెంటేటివ్ జెఫ్ రాయ్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ గౌరవం తన వ్యక్తిగత సేవలకు మాత్రమే కాకుండా సమాజం కోసం తమ సమయాన్ని, శక్తిని, వనరులను అందిస్తూ నిస్వార్థంగా సేవ చేస్తున్న వాలంటీర్లందరికీ లభించిన గుర్తింపుగా పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజాసేవలో మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతూ మరెందరో జీవితాల్లో వెలుగులు నింపాలని కమ్యూనిటీ సభ్యులు ఆయనను అభినందించారు.

# తెలుగు భాష పరిరక్షణకు సమష్టిగా కృషిచేద్దాం

### హాంకాంగ్ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు జయ పీసపాటి

సింగపూర్: హాంకాంగ్ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు జయ పీసపాటి సింగపూర్ పర్యటన సందర్భంగా సాంస్కృతిక కళాసారథి ఆధ్వర్యంలో సింగపూర్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. సుబ్బు వి.పాలకుర్తి ఆధ్వర్యంలో సరిగమ గ్రాండ్ రెస్టారెంట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అనేక మంది తెలుగు ప్రముఖులు, సాహితీ, సాంస్కృతిక రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయ పీసపాటి మాట్లాడుతూ హాంకాంగ్ తెలుగు సమాఖ్య ఆవిర్భావానికి ముందు జరిగిన పరిణామాలతో పాటు, గత 22 సంవత్సరాలుగా సమాఖ్య ద్వారా తెలుగువారికి అందిస్తున్న సేవలను వివరించారు. తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యాన్ని భావితరాలకు అందించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళలు మీడియా సహా వివిధ రంగాల్లో మరింత చురుకైన పాత్ర పోషించడం ద్వారా సమాజంలోని మరెందరికో స్ఫూర్తిగా నిలవగలరని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో పిల్లలకు తెలుగు నేర్పించడం. ద్వారా వారికి భాషపై అభిమానం పెంపొందించడంతో పాటు, ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తెలుగువారిగా ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు.



# డల్లాస్‌లో పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు



డల్లాస్: ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు డల్లాస్‌లో సందడిగా జరిగాయి. డల్లాస్ మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ది కాలనీలోని ట్విస్టెడ్ బార్ అండ్ గ్రిల్‌లో నిర్వహించిన ఈ వేడుకలకు డీఎఫ్‌డబ్ల్యూ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పవన్‌కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అభిమానులంతా వేడుకలను ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కటింగ్, డీజే నైట్, సంగీతం, డ్యాన్స్‌తో అభిమానులు సందడి చేశారు. పవన్‌కళ్యాణ్ ఆరోగ్యంగా ఉండాలని, మరింత కాలం ప్రజాసేవలో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 300 మందికి పైగా పవన్‌కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

# అమెరికాలో తెలుగు యువకుడి మృతి

అమెరికా: అమెరికాలో మరో విషాదం చోటుచేసుకుంది. ఆర్కాన్సాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ తెలుగు యువకుడు ప్రాణాలు కోల్పోయారు. అనంతపురానికి చెందిన నిస్సార్ షేక్ అహ్మద్ (34).. ఆర్కాన్సాస్ రాష్ట్రంలోని లిటిల్ రాక్ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తన స్నేహితుడిని కలిసేందుకు కారులో వెళుతుండగా ప్రమాదవశాత్తు ట్రక్కును ఢీకొని ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఒహాయోలోని కెంట్ యూనివర్సిటీలో ఉన్నత విద్య పూర్తి చేసిన నిస్సార్.. ప్రస్తుతం అక్కడే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పనిచేస్తున్నారు. ఇటీవలే అతడి తండ్రి షేక్ సైఫుద్దీన్‌కు గుండె ఆపరేషన్ జరిగింది. ఆయన కోలుకుంటున్న సమయంలోనే కుమారుడి అకాల మరణంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.



నిస్సార్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకు వచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మరోవైపు, నిస్సార్ స్నేహితులు, పలువురు తెలుగు సంఘాల ప్రతినిధులు సహాయం చేసేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.



# మెట్రోలో ప్రధాని మోదీ

భారత ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాల కోసం ఢిల్లీ మెట్రోలో ప్రయాణించారు. ప్రధాని మోదీ కాన్వాయ్‌లో కాకుండా మెట్రో రైలులోనే కాలేజీకు వెళ్లి వచ్చారు. మెట్రో ప్రయాణం సందర్భంగా చిన్న పిల్లలు, మహిళలతో ఆయన ముచ్చటించారు. ప్రధాని మోదీ తన ప్రయాణానికి సంబంధించిన ఫొటోలు, వీడియోను మెట్రో మూమెంట్స్ శీర్షికతో ఆదివారం ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.

# ఢిల్లీలో కూలిన భవనం

### నలుగురు మృతి



దేశ రాజధాని ఢిల్లీలోని సత్య నికేతన్ నైరుతి ప్రాంతంలో ఓ నాలుగు అంతస్తుల భవనం కూలిపోయిన దుర్ఘటనలో నలుగురు మృతి చెందారు. 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులను రక్షించారు. మరికొంత మంది చిక్కుకుపోయారనే అనుమానంతో వారిని బయటకు తీసేందుకు సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌కు సమీపంలో పీజీ (పేయింగ్ గెస్ట్)గా సేవలందిస్తున్న ఈ భవనం ఆదివారం మధ్యాహ్నం కూలిపోయిందని అధికారులు తెలిపారు. ఆ సమయంలో కనీసం 50 మంది విద్యార్థులు అందులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. సెలవు దినం కావడంతో దాదాపు అందరూ పీజీలోనే ఉండిపోయారని వివరించారు. సమాచారం అందుకున్న అధికారులు.. సహాయక చర్యల నిమిత్తం కనీసం 12 ఫైరింజన్లు సహా ఓ ఎక్స్‌కవేటర్‌ను ఘటనా స్థలానికి పంపారు. అగ్నిమాపక సిబ్బందికి సాయపడేందుకు విపత్తు ప్రతిస్పందనా బృందాలు కూడా రంగంలోకి దిగాయి.

# మధ్యప్రదేశ్‌లో విషాదం

### కల్తీ మద్యానికి 11 మంది బలి



మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో కల్తీ మద్యం తాగి 11 మంది మృతి చెందారు. 80 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారు. సాగర్ జిల్లాలోని బండా తహసీల్‌లోని ఓ మద్యం దుకాణంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందినవారు శనివారం రాత్రి మద్యంతాగారు. ఇంటికి వచ్చిన వెంటనే తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు.అనంతరం ఆరోగ్యపరిస్థితి విషమించడంలో చికిత్స పొందుతూ 11 మంది మృతి చెందారు. ఇదే మద్యం తాగిన పలువురి పరిస్థితి విషమంగా ఉంది. అధికారులు వెంటనే స్పందించి వైద్య బృందాలను రంగంలోకి దించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అనారోగ్యానికి గురైన వారిని గుర్తిస్తున్నారు. అస్వస్థతగా ఉన్నవారిని మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలిస్తున్నారు. మద్యంలో విషపూరిత రసాయనం కలిసిందా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా విక్రయించిన మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకుని పరీక్షలకు పంపారు. ఈ ఘటనపై విచారణకు జిల్లా యంత్రాంగం ఆదేశించింది. ఆయా ప్రాంతాల్లో గత 24 నుంచి 48గంటల్లో మద్యం తాగిన వారు.. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచించారు.

## రష్యా చమురు కొనుగోలు...

# భారత్ సొంత అవసరాల కోసమే

భారత్ తన సొంత అవసరాల కోసమే తమ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తోందని ఇండియాలోని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. భారత్ చమురును కొనుగోలు వెనుక ఉన్న ఉద్దేశం కేవలం తన సొంత దేశ ఇంధన భద్రత, జాతీయ ప్రయోజనాలు మాత్రమేనని, రష్యాకు ఆర్థికంగా సహాయం చేయడం కాదని చెప్పారు. పాశ్చాత్య దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై అదనపు టారిఫ్‌లు, తీవ్రమైన ఆంక్షలు విధిస్తామని హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ తన 140 కోట్ల జనాభా ఇంధన అవసరాలు, దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే రష్యా చమురును కొనుగోలు చేస్తోంది తప్ప ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు



మద్దతుగా కాదని అలిపోవ్ పేర్కొన్నారు. నాణ్యమైన లేదా తక్కువ ధరకే చమురు అందించే మెరుగైన ప్రత్యామ్నాయ ఒప్పందాలను భారత్‌కు అందించలేక... అమెరికా, పాశ్చాత్య దేశాలు ఆంక్షల పేరుతో ఒత్తిడి తంత్రాలు ఉపయోగిస్తున్నాయని విమర్శించారు.

భారతదేశానికి ఎంత పరిమాణంలో చమురు అవసరమైతే అంత సరఫరా చేయడానికి రష్యా సిద్ధంగా ఉందన్నారు. భారత్ తన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోగలదని రష్యా విశ్వసిస్తోందని ఆయన తెల్పి చెప్పారు.

# గుండెపోటుతో జార్ఖండ్ మంత్రి మృతి



జార్ఖండ్ ఉన్నత, సాంకేతిక విద్య, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి సుదివ్య కుమార్ సోను(56) గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) సీనియర్ నేత సుదివ్య కుమార్ శనివారం రాత్రి అస్వస్థతకు గురికాగా రాంచీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 4:00 గంటల సమయంలో ఆయన కన్నుమూశారు.

1970 జులై 26న జన్మించిన సోనుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. సోను 2019లో గిరిడీహ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. ఉన్నత విద్య, పట్టణాభివృద్ధితో పాటు పర్యాటకం, కళలు, సాంస్కృతికం, క్రీడలు, యువజన వ్యవహారాల శాఖల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సోను మృతిపై సీఎం హేమంత్ సోరెన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయననో విశ్వసనీయ సహచరుడు, మార్గదర్శి, జార్ఖండ్ ఉద్యమానికి అంకితమైన నేతగా స్మరించుకున్నారు సోరెన్. మరోవైపు.. మంత్రి మృతిపై జేఎంఎం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. జేఎంఎం పార్టీ సహా ప్రభుత్వానికి, జార్ఖండ్‌కు ఇది తీరని లోటు అని పేర్కొంది.

# చనిపోయాడనుకుని అంత్యక్రియలు...

### బతికే ఉన్నాడని 15 రోజుల తరువాత ఫోన్!

చనిపోయాడనుకుని అంత్యక్రియలు నిర్వహించగా.. ఆ యువకుడు బతికే ఉన్నాడని 15 రోజుల తరువాత తెలిసిన విచిత్రం పంజాబ్‌లోని కపుర్తలాలో ఓ చోటుచేసుకుంది. ఇటీవల తమ కుమారుడు కనిపించకుండా పోయాడని ఫిర్యాదు చేసిన ఓ కుటుంబానికి.. స్థానిక పోలీసులు ఓ మృతదేహాన్ని అప్పగించారు. అది తమ కుమారుడే అని భావించిన ఆ కుటుంబసభ్యులు అంత్యక్రియలు చేశారు. చనిపోయాడనుకున్న కుమారుడు.. బతికే ఉన్నాడని 15 రోజుల తర్వాత పోలీసుల నుంచి ఫోన్ రావడంతో ఆశ్చర్యపోయారు.



కపుర్తలా గ్రామానికి చెందిన రవి కుమార్ ఆగస్టు 5న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా అతడి ఆచూకీ తెలియకపోవడంతో ఆగస్టు 11న కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు అతడి కోసం గాలిస్తుండగా.. కాలిపోయిన స్థితిలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. దీంతో పోలీసులు రవికుమార్ కుటుంబసభ్యులకు దానిని సమాచారం ఇచ్చారు. ఆ మృతదేహం తమ కుమారుడిదేనని అతడి తల్లిదండ్రులు గుర్తించడంతో వారికి అప్పగించారు. ఆగస్టు 13న మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

సెప్టెంబర్ 2న కపుర్తలా సెంట్రల్ జైలు పోలీసుల నుంచి రవికుమార్ కుటుంబానికి ఫోన్ కాల్ వచ్చింది. అతడు చనిపోలేదని.. అనుమానాస్పదంగా సంచరిస్తున్న కేసులో నెల రోజుల క్రితం జలంధర్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలపడంతో కుటుంబసభ్యులు ఆశ్చర్యపోయారు. జైలుకు వెళ్లిన కుటుంబసభ్యులు అక్కడ రవికుమార్‌ను చూసి ఆనందం వ్యక్తం చేశారు. చనిపోయాడనుకున్న తమ కుమారుడు మళ్లీ రావడంతో ఆనందంతో కన్నీరుపెట్టుకున్నారు. అయితే, అంత్యక్రియలు నిర్వహించిన ఆ మృతదేహం ఎవరిదనే కోణంలో పోలీసులు ఇప్పుడు దర్యాప్తు చేపట్టారు.




### గాల్లో విమానానికి సాంకేతిక సమస్య:

# ఎమర్జెన్సీ ల్యాండింగ్

టేకాఫ్ అయిన కొంత సేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో వెనక్కి తిరిగి వచ్చింది. ఈ ఘటన బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. విమానాశ్రయ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. వర్జిన్ అట్లాంటిక్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ఆదివారం ఉదయం 8.20 గంటలకు బెంగళూరు నుండి లండన్‌కు బయల్దేరింది. టేకాఫ్ అయిన కొద్ది సేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు గుర్తించిన పైలట్లు విమానాశ్రయ అధికారులను అప్రమత్తం చేశారు. విమానాన్ని అరగంటకు పైగా గాలిలో చక్కర్లు కొట్టించారు. అనంతరం వెనక్కి తీసుకువచ్చి విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఘటన జరిగిన సమయంలో విమానంలో సిబ్బంది సహా మొత్తం 270మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించి, విమానాన్ని తనిఖీలకు తరలించారు. ఘటనపై డీజీసీఏ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# జేఎన్‌యూ ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు

ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయాని (జేఎన్‌యూ)కి చెందిన ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఓ ప్రొఫెసర్ తమతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని.. యూనివర్సిటీకి చెందిన 10మంది విద్యార్థినులు నెల రోజుల క్రితం యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. క్యాంపస్‌లోని ఆయన నివాసంలో జరిగే సమావేశాలకు ఆహ్వానించి.. ఎవరూ లేని సమయంలో తమతో అసభ్యకరంగా ప్రవర్తించే వారని పేర్కొన్నారు. తరగతుల సమయంలో కూడా అసభ్యకరంగా మాట్లాడుతుంటారని తెలిపారు. తాము కూడా సదరు ప్రొఫెసర్‌తో




అటువంటి సమస్యలే ఎదుర్కొన్నట్లు పలువురు సీనియర్ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థినుల ఆరోపణలపై విశ్వవిద్యాలయం అంతర్గత ఫిర్యాదుల కమిటీ దర్యాప్తు చేపట్టింది. అయితే ఈ విషయంపై జేఎన్‌యూ పరిపాలన విభాగం, వైస్-ఛాన్సలర్ కార్యాలయం ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

# కలిసికట్టుగా ఇజ్రాయెల్‌పై దాడి చేద్దాం



- హెజ్‌బుల్లా, హమాస్, హూతీలు, ఇరాక్ మిలీషియాలతో కలిసి ఇరాన్ ప్రణాళికలు
- ఇజ్రాయెల్ నిఘా వర్గాల సమాచారం

అమెరికాతో కలిసి.. తమ దేశంపై దాడులకు పాల్పడిన ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు ఇరాన్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తమ దేశాధినేతల మరణానికి కారణమైన వారిని అంతం చేస్తామని ఇప్పటికే ఇరాన్ పలుమార్లు హెచ్చరించింది. ఈ క్రమంలో ఇజ్రాయెల్ నిఘా వర్గాలు కీలక విషయాలు వెల్లడించాయి. తమ దేశంపై భారీ స్థాయిలో దాడులు చేపట్టడానికి ఇరాన్ ప్రణాళిక రచిస్తున్నట్లు ఇజ్రాయెల్ నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అన్ని వైపుల నుంచి ఏకకాలంలో తమను లక్ష్యం చేసుకోవడానికి హెజ్‌బుల్లా, హమాస్, హూతీలు, ఇరాక్‌లోని సాయుధ ముఠాలతో ఇరాన్ జట్టు కడుతోందని ఇజ్రాయెల్ నిఘా వర్గాలు చెబుతున్నాయి.

భవిష్యత్తులో జరగబోయే ఈ దాడి 2023 అక్టోబర్ 7న హమాస్ చేసిన దాడికంటే మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని తెలిపాయి. ఇందులో భాగంగా ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ తన బలగాలను లెబనాన్ లోని హెజ్‌బుల్లా, హమాస్, యెమెన్‌లోని హూతీలతో కలిపి మోహరించేందుకు ప్లాన్ వేస్తున్నట్లు వెల్లడించాయి. ఈ మేరకు ఇజ్రాయెల్‌లోని ప్రముఖ పత్రిక సంచలన కథనం వెలువరించింది.

నిఘా వర్గాల ప్రకారం.. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపు దాడి చేసినా అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయింది. దీంతో ఈసారి మిత్రదేశాలతో కలిసి.. ఇజ్రాయెల్ పై దాడులకు ప్రణాళికలు రచిస్తోంది. ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు వేయాలనేది వారి ప్లాన్. ఈ పరిస్థితులకు హమాస్ నాయకత్వంలో వచ్చిన మార్పు కూడా ఓ కారణం. జులైలో హమాస్ అత్యున్నత నాయకుడిగా ఎన్నికైన ఖలీల్ అల్-హయ్యాకు ఇరాన్‌తో మంచి సంబంధాలు ఉన్నాయి. దీంతో ఇజ్రాయెల్‌పై పగ తీర్చుకోవడానికి ఉమ్మడిగా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ దాడి కోసం ఇరాన్ కొన్ని బృందాలను, సమన్వయ యంత్రాంగాలను కూడా సిద్ధం చేస్తోంది. ఇజ్రాయెల్‌పై దాడులకు సంబంధించి హెజ్‌బొల్లా, హూతీలు, ఇరాకీ మిలీషియాలలోని కమాండర్లతో ఐఆర్‌జీసీ ఖుద్స్ ఫోర్స్ ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. ఐఆర్‌జీసీకి చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు, ఖుద్స్ ఫోర్స్ సీనియర్ అధికారులు, ఇతర కమాండర్లతో కాన్ఫరెన్స్ కాల్స్ నిర్వహించారు. అలాగే ఇరాన్ సలహాదారులు కూడా క్షేత్రస్థాయిలో వారితో కలిసి పనిచేశారు. అదే సమయంలో క్షిపణులు, డ్రోన్ల ఉత్పత్తిని వేగవంతం చేయడానికి, దెబ్బతిన్న అణు సామర్థ్యాలను పునరుద్ధరించడానికి ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆ పత్రిక కథనంలో పేర్కొంది.

# టీవీ వ్యాఖ్యాత సహా 12 మందికి మరణ శిక్ష

- డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో ఈజిప్ట్ కోర్టు తీర్పు



మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో టీవీ వ్యాఖ్యాత సారా ఖలీఫా (39) సహా 12 మందికి మరణశిక్ష విధిస్తూ ఈజిప్టులోని న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. మరో తొమ్మిది మంది దోషులకు జీవిత ఖైదు విధించగా.. ఏడుగురిని నిర్దోషులుగా ప్రకటించింది.

నిందితులు విదేశాల నుంచి ముడిపదార్థాలను దిగుమతి చేసుకోవడం, స్థానికంగా సింథటిక్ డ్రగ్స్ తయారు చేయడం, వాటిని విక్రయించడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో అధికారులు గుర్తించారు. గతేడాది దాడుల్లో 750 కిలోలకుపైగా మాదక ద్రవ్యాలు, ముడి పదార్థాలు, లైసెన్స్ లేని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

దర్యాప్తులో భాగంగా గతేడాది ఏప్రిల్లోనే సారాను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను ఆమె ఖండించారు. తాను ఎన్నడూ డ్రగ్స్ వాడలేదని, కనీసం సిగరెట్ కూడా తాగలేదని చెబుతూ విచారణ సందర్భంగా కోర్టులో విలపించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. తాజాగా మరణశిక్ష పడడంతో.. తీర్పుపై అప్పీలుకు వెళ్తామని ఆమె తరపు న్యాయవాది వెల్లడించారు.

ఈజిప్టుకు చెందిన సారా ఖలీఫా స్థానికంగా టెలివిజన్ ప్రెజెంటర్‌గా గుర్తింపు పొందారు. నేరాలు, భద్రత సంబంధిత అంశాలతో కూడిన 'మిషన్ ఇంపాజిబుల్' అనే కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. కాస్మెటిక్ సర్జరీ క్లినిక్ తోపాటు ఈవెంట్లు, పార్టీలు నిర్వహించే ప్రొడక్షన్ కంపెనీ కూడా ఉన్నట్లు సమాచారం. సోషల్ మీడియాలో క్రియాశీలంగా ఉండే ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 25 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు.

ఈజిప్టులో ఉగ్రవాదం, హత్య, అత్యాచారం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి నేరాల్లో మరణశిక్ష అమలు అవుతోంది. అయితే, డ్రగ్స్ కేసుల్లో మరణదండన విధించడాన్ని అక్కడి మానవ హక్కుల సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఇదిలాఉంటే, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదిక ప్రకారం... 2025లోనే ఈజిప్టు 492 మరణశిక్షలు విధించగా, వాటిలో 23 అమలు చేసింది.

## పాక్‌పై చైనా అసంతృప్తి

- జేయూఐ-ఎఫ్ నేత ఫజ్లుర్ రెహ్మాన్



పాకిస్థాన్ మధ్య చైనా సంబంధాలు దెబ్బతింటున్నాయని పాకిస్థాన్ రాజకీయాలపై గట్టి ప్రభావం చూపించే జమియత్ ఉలేమా-యే-ఇస్లాం-ఫజల్ (జేయూఐ-ఎఫ్) అధినేత మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్ వ్యాఖ్యానించారు. బలూచిస్థాన్ మైనింగ్ ప్రాజెక్టులు, పాక్ ఆర్థిక పతనానికి సంబంధించి పాకిస్థాన్ తీరు పట్ల చైనా తీవ్ర అసంతృప్తితో ఉందనే విషయాన్ని వెల్లడిస్తూ బలూచిస్థాన్‌లోని మైనింగ్ ప్రాజెక్టుల నుంచి చైనా క్రమంగా వైదొలుగుతోందని పేర్కొన్నారు. పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి, భద్రతాపరమైన సవాళ్ల కారణంగా చైనా అసంతృప్తిగా ఉంది. బలూచిస్థాన్‌లోని కొన్ని కీలక మైనింగ్ ప్రాజెక్టుల నుంచి చైనీస్ కంపెనీలు తమ వ్యాపారాన్ని, పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నాయి.

బలూచిస్థాన్‌లో నిక్షేపమై ఉన్న భారీ ఖనిజ సంపద ద్వారా పాకిస్థాన్‌కు వస్తున్న ప్రయోజనం ఎంత అని ఆయన ప్రశ్నించారు. 'రేకో డిక్' ప్రాజెక్టులో ఎవరు తవ్వకాలు జరుపుతున్నారు? అక్కడ లభించే విలువైన ఖనిజాలు ఎక్కడికి వెళ్తున్నాయి? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. దశాబ్దాలుగా నడుస్తున్న 'సైందక్' కాపర్-గోల్డ్ ప్రాజెక్ట్ సరైన ఫలితాలను ఇవ్వడంలో విఫలమైందని విమర్శించారు.

పాకిస్థాన్లో ప్రజాస్వామ్యం కంటితుడుపుగా మారింది. దేశంలో 'రాజకీయ బానిసత్వం' ఇంకా ఉనికిలోనే ఉందని, కేవలం దానికి ఉన్న రూపం మాత్రమే మారిందని ఆయన విమర్శించారు. సైనిక వ్యవస్థ, ప్రభుత్వ విధానాల వల్ల దేశం సొంతంగా నిర్ణయాలు తీసుకోలేకపోతోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ రుణదాతలపై పాకిస్థాన్ తీవ్రంగా ఆధారపడుతుండటంతో దేశ సార్వభౌమాధికారం, నైతికత దెబ్బతింటున్నాయని తెలిపారు.

### రాష్ట్రాల విభజనకు వ్యతిరేకత

పాకిస్థాన్ ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రాలను/ప్రాంతాలను విభజించడం సరైన పరిష్కారం కాదు. నూతన రాష్ట్రాల ఏర్పాటు ప్రతిపాదనలను కేవలం క్షేత్రస్థాయి వాస్తవాలు, ఆచరణాత్మకత ప్రాతిపదికన మాత్రమే అంచనా వేయాలని ఆయన సూచించారు.



## అమెరికా యుద్ధనౌకలపై ఇరాన్ దాడి

హర్మూజ్ జలసంధిలో అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ప్రతీకార దాడులు కొనసాగుతున్నాయి. అమెరికా బలగాలు ఇరాన్‌కు చెందిన మూడు ఆయిల్ ట్యాంకర్లపై దాడులు చేసిన నేపథ్యంలో..ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) దళాలు అగ్రరాజ్యానికి చెందిన మూడు యుద్ధ నౌకలపై దాడులు చేశాయి. అమెరికాకు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, గైడెడ్-మిస్సైల్ డిస్ట్రాయర్ బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడ్డాయి. అమెరికా యుద్ధ నౌకలు హర్మూజ్‌లో ఇరాన్ ట్యాంకర్లను అడ్డుకుంటుండడంతో వాటిని లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దాడుల్లో అమెరికా నౌకలు తీవ్రంగా దెబ్బతిన్నాయని.. ఆ తర్వాత అవి హర్మూజ్‌ను విడిచి వెళ్లిపోయాయని తెలిపింది. శనివారం హర్మూజ్‌లోని ఇరాన్ చమురు ట్యాంకర్లపై అమెరికా దాడుల అనంతరం ఐఆర్జీసీ ఈ దాడులకు పాల్పడింది. హర్మూజ్‌లో అనధికారిక మార్గాల్లో ప్రయాణిస్తున్న మూడు ట్యాంకర్లను.. అమెరికాకు అనుబంధంగా ఉన్న మరో మూడు నౌకలను కూడా లక్ష్యం చేసుకున్నట్లు ఇరాన్ తెలిపింది. 'ఇరాన్ నౌకల విషయంలో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తూ.. దాడులు కొనసాగిస్తే మా నుంచి గట్టి ప్రతిస్పందనను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆ దేశ సైనిక నౌకలపై దాడులు మరింత తీవ్రతరం చేస్తాం. గతంలో కంటే ఇప్పుడు మేము మరింత బలంగా ఉన్నాము' అని ఐఆర్‌జీసీ పేర్కొంది.

### మా నౌకలు తప్పించుకున్నాయ్..

కాగా మరోవైపు ఇరాన్ దాడుల నుంచి తమ నౌకలు సురక్షితంగా తప్పించుకున్నాయని అమెరికా ప్రకటించింది. ఈ దాడుల్లో తమ సిబ్బందికి ఎటువంటి గాయాలు కాలేదని.. అందరూ సురక్షితంగా ఉన్నారని పేర్కొంది. తమ నౌకాదళాన్ని లక్ష్యం చేసుకుంటే.. ఇరాన్ నౌకలపై దాడులు మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించింది.

## పెళ్లి వేడుకల్లో అగ్ని ప్రమాదం: 22 మంది మృతి

డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ ది కాంగోలో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పెళ్లి పార్టీ సందర్భంగా ఓ బిల్డింగ్‌లో మంటలు చెలరేగటంతో దాదాపు 22 మంది ప్రాణాలు కోల్పోయారు. కాంగో రాజధాని కిన్షాసాలో శనివారం రాత్రి ఈ దారుణం చోటుచేసుకుంది. ఓ భవనంలో పెళ్లి వేడుకలు జరుగుతుండగా అర్ధరాత్రి ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో చిక్కి 22 మంది ప్రాణాలు కోల్పోయారు. మరి కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడ్డవారిని చికిత్స నిమిత్తం దగ్గరిలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరగడానికి కారణం ఏంటో తెలియరాలేదని అధికారులు చెప్పారు.





# చైనా గోడ బద్దలు..

## సాత్విక్, చిరాగ్ జోడీకి టైటిల్

భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజు, చిరాగ్ శెట్టి చైనా గోడను బద్దలు కొట్టింది. సాత్విక్- చిరాగ్ శెట్టి చైనా మాస్టర్స్ సూపర్ 750 టైటిల్ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఈ ద్వయం 11-21, 21-13, 21-17తో హెజి టింగ్- రెన్ గ్జియాంగ్ జోడీపై విజయం సాధించింది. ఈ జోడికి ఇదే తొలి చైనా మాస్టర్స్ టైటిల్ కావడం విశేషం.

గతంలో వరుసగా రెండుసార్లు (2023, 2025లో) రన్నరప్‌గా నిలిచిన సాత్విక్-చిరాగ్ జోడీ ఈ సారి మాత్రం మాత్రం చాంపియన్‌గా నిలిచింది. ఈ ఏడాది సాత్విక్, చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్ కావటం విశేషం. ఈ జోడీ ఇటీవలే సింగపూర్ ఓపెన్ సూపర్-750 టైటిల్‌ను గెలుచుకున్న సంగతి తెలిసిందే. అంతేకాదు థాయ్‌ల్యాండ్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలోనూ ఈ జంట ఫైనల్‌కు చేరింది.

చైనా మాస్టర్స్ సూపర్ 750 ఫైనల్ మ్యాచ్ ఆరంభం నుంచి మంచి జోరు మీద కనిపించినప్పటికీ సాత్విక్-చిరాగ్ జోడీ తొలి గేమును కోల్పోయారు. అయితే రెండో గేమ్‌లో పుంజుకున్న ఈ జంట 21-13తో చైనా జోడికి చెక్ పెట్టారు. ఇక కీలకమైన మూడో గేమ్‌లో మాత్రం మొదట తడబడినా తరువాత పుంజుకున్నారు.

ఒక దశలో 11-9తో వెనుకబడిన సాత్విక్ జంట విజృంభించి 16-16తో స్కోరును సమం చేసింది. ఈ తరువాత ఒక్కసారిగా చెలరేగిపోయిన సాత్విక్, చిరాగ్



ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండా 21-17తో గేమ్‌ను ముగించడంతో పాటు మ్యాచ్‌ను కూడా గెలిచారు. 2023, 2025 సీజన్లలో ఫైనల్లో విఫలమైన ఈ జంట ఈసారి మాత్రం టైటిల్ గెలుపే లక్ష్యంగా ఆటను కొనసాగించారు. ఇన్నాళ్లు చైనా ఫోబియాను ఎదుర్కొన్న ఈ జంట అన్ని అనుమానాలను పటాపంచలు చేస్తూ చాంపియన్స్ నిలిచారు.

# ఇషాన్ అజేయ శతకం

## - భారీస్కోరు దిశగా ఈస్ట్ జోన్ - దులీప్ ట్రోఫీ ఫైనల్



చెన్నై చిదంబరం స్టేడియం వేదికగా జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ తొలిరోజే స్పష్టమైన ఆధిక్యం కనబరి చింది. ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ అజేయ సెంచరీతో కదం తొక్కడంతో ఆ జట్టు భారీస్కోరు దిశగా పరుగులు పెడు తోంది. టాస్ గెలిచిబ్యాటింగ్ ఎంచుకున్న ఈస్ట్ జోన్ తొలి రోజు ఆదివారం ఆట ముగిసేసరికి 4వికెట్ల నష్టానికి 385 పరు గులు చేసింది. కెప్టెన్ ఇషాన్ కిషన్(111 నాటౌట్: 135బంతుల్లో 14ఫోర్లు, 1సిక్స్) శతకంతో ఆకట్టుకున్నాడు. వన్ డౌన్ బ్యాటర్ శిఖర్‌మోహన్ (85; 120 బంతు ల్లో 9 ఫోర్లు, 3 సిక్సులు) సెంచరీచేసే ఛాన్స్ మిస్ చేసుకున్నాడు.

ఆరోస్థానంలో వచ్చిన కుమార్ కుశాగ్ర (63 నాటౌట్: 75 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్ లు) అర్ధశతకం సాధించాడు. అంత కుముందు ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (72, 86 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్), వైభవ్ సూర్యవంశీ (44; 37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్కు 100 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి శుభారంభం అందించారు. అభిమన్యు ఈశ్వరన్ రనౌట్ కాగా.. సౌత్ జోన్ బౌలర్లలో సీవీ మిలింద్ 2, త్రిపురాణ విజయ్ ఒక వికెట్ పడగొట్టారు.

### వైభవ్ మాస్.. అభిమన్యు, శిఖర్ క్లాస్

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఈస్టజోన్కు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. వన్డే తరహాలో వేగంగా ఆడిన వైభవ్ సూర్యవంశీ దంచికొట్టాడు. మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ మరో ఎండ్‌లో నింపాదిగా ఆడాడు.

వైభవ్ ఔటయ్యాక బరిలోకి దిగిన శ్రీకర్ మోహన్ కూడా తనదైన శైలి బ్యాటింగ్‌తో అలరించాడు. అభిమన్యు, సుదీప్ కుమార్ స్వల్ప వ్యవధిలో వెనుదిరిగినప్పటికీ, శిఖర్‌కు జత కలిసిన ఇషాన్ కిషన్ చెలరేగిపోయాడు. సౌత్ జోన్ బౌలింగ్‌ను చీల్చి చెండాడిన ఇషాన్ అర్ధసెంచరీ మార్క్ చేరుకున్నాడు. తరువాత శిఖర్ ఔటైనప్పటికీ, కుమార్ కుషాగ్ర వేగంగా ఆడి పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలోనే ఇషాన్ కిషన్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కాగా ఇషాన్ కిషన్‌కు ఫస్ట్ క్లాస్ క్రికెట్లో ఇది పదో సెంచరీ. అనంతరం కాసేపటికే కుమార్ కుషాగ్ర కూడా అర్ధసెంచరీ సాధించాడు. ఈ నేపథ్యంలో మరో 10 ఓవర్లు మిగిలి ఉండగానే వెలుతురు లేమి కారణంగా అంపైర్లు తొలి రోజు ఆట ముగిసినట్లు ప్రకటించారు.

### వైభవ్‌తో తిలక్ స్లెడ్జింగ్

కాగా మ్యాచ్‌లో సౌత్ జోన్ జట్టు కెప్టెన్ తిలక్ వర్మ.. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మధ్య చోటు చేసుకున్న ఓ సరదా సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈస్ట్ జోన్ వైస్ కెప్టెన్ వైభవ్ దూకుడుగా ఆడుతుండటంతో తిలక్ వర్మ అతడిని సరదాగా స్లెడ్జ్ చేశాడు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. భారీ షాట్లతో విరుచుకుపడుతున్న వైభవ్‌ను ఆపడానికి సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ తెగ ప్రయత్నించాడు. వైభవ్ దగ్గరికి వెళ్లి 'వైస్ కెప్టెన్.. ఏంటిది?' అంటూ స్లెడ్జింగ్‌కు దిగినట్లు వైరల్ అవుతోన్న వీడియోలో కనిపించింది. అయితే దీని తర్వాత ఇద్దరూ నవ్వుకోవడంతో విషయం పెద్ద సీరియస్‌గా లేదని స్పష్టమైంది. అనూహ్యంగా ఈ ఘటన తర్వాత వైభవ్ 44 పరుగుల వద్ద పెవిలియన్ చేరాడు.

# కౌంటీల్లో సత్తా చాటిన సాయి కిషోర్



భారత జట్టులో చోటు కోసం ఎదురుచూస్తోన్న తమిళనాడు స్పిన్నర్ సాయి కిశోర్ మరోసారి సత్తాచాటాడు. ఇంగ్లండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో గ్లాస్టర్‌షైర్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తోన్న కిశోర్.. అదిరిపోయే ప్రదర్శన చేశాడు. డెర్బీషైర్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 20 పరుగులిచ్చి 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. తన సూపర్ స్పెల్‌తో టీమిండియా సెలెక్టర్లకు మరోసారి సవాల్ విసిరాడు.

రెడ్ బాల్ క్రికెట్‌లో సాయి కిశోర్‌కు మంచి రికార్డు ఉంది. రంజీ ట్రోఫీలో నిలకడగారాణిస్తున్న అతడు.. ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లోనూ వరుసగా ప్రభావం చూపిస్తున్నాడు. అయినా భారత టెస్టు జట్టులో మాత్రం అతడికి చోటు దక్క డం లేదు. కౌంటీ క్రికెట్‌లో ఇలాంటి ప్రదర్శనలతో టెస్టు క్రికెట్‌కు సిద్ధంగా ఉన్నాననే సంకేతాన్ని సాయి కిశోర్ మరోసారి సెలెక్టర్లకు పంపాడు. దేశ వాళీ క్రికెట్‌లో అద్భుతమైన రికార్డు, ఎడమచేతి వాటం స్పిన్నర్‌గా ఉండటం, ఇంగ్లాండ్ పరిస్థితుల్లోనూ రాణించే సామర్థ్యం.. ఇవన్నీ అతడికి కలిసొచ్చే అంశాలే.

భారత టెస్టు జట్టు ప్రస్తుతం మార్పుల దశలో ఉంది. సీనియర్ ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేసేందుకు యువ ప్లేయర్ల కోసం టీమ్ మేనేజ్ మెంట్ చూస్తోంది. ఈనేపథ్యంలో కోచ్ గౌతమ్ గంభీర్ ఆధ్వర్యంలో భారత టెస్టు జట్టు భవిష్యత్తు ప్రణాళికల్లో సాయి కిశోర్ కీలక ఎంపికగా మారే అవకాశం ఉంది. రంజీ ట్రోఫీతో పాటు కౌంటీ ఛాంపియన్‌షిప్‌లోనూ వరుసగా తనను తాను నిరూపించుకుంటున్న ఈ తమిళనాడు స్పిన్నర్.. ఇకనైనా సెలెక్టర్ల దృష్టిలో పడతాడా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# మహిళల ఆసియా కప్ గెలిచేది మేమే

## - పాకిస్థాన్ కోచ్ గొప్పలు

మహిళల ఆసియా కప్‌లో భారత్‌తో మ్యాచ్‌లో పాకిస్థాన్ ఘోరంగా విఫలమైన సంగతి తెలిసిందే. అయినప్పటికీ పాక్ కోచ్ వహాబ్ రియాజ్ చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. భారత స్పిన్నర్ల ధాటికి పాక్ 55పరుగులకే కుప్ప కూలింది. అనంతరం 8.4 ఓవర్లలోనే టీమిండియా ఆటను ముగించింది. పాకిస్థాన్ బ్యాటర్ల పేలవ ప్రదర్శన మైదానంలో చాలా స్పష్టంగా కనిపించింది. బౌలర్లలో కెప్టెన్ ఫాతిమా సనా మినహా ఎవరూ ప్రభావం చూపలేకపోయారు. కానీ పాక్ కోచ్ మాత్రం ఆసియా కప్ తామే గెలుస్తామని చెప్పడం గమనార్హం.మా జట్టులో ప్లేయర్లందరూ మంచి ప్రతిభ ఉన్నవారే. వాళ్లు తమపై తాము నమ్మకం ఉంచాలి. మా తర్వాతి మ్యాచ్ హాంకాంగ్‌తో ఉంది. భారత్‌తో మ్యాచ్‌లో ఏం తప్పులు చేశామో సమీక్షించుకుంటా. ఆ తప్పులు మళ్లీ జరగకుండా చూసుకుంటాం. ఈ ఆసియా కప్‌లో ట్రోఫీ గెలిచే అత్యుత్తమ జట్టు పాకిస్థాన్ అని నేనుఇప్పటికీ నమ్ముతున్నా. ఇక్కడి పరిస్థితులు మా జట్టుకు బాగా



అనుకూలిస్తాయి. ఆసియా కప్ గెలిచేది మేమే అని రియాజ్ అతిశయం ప్రదర్శించాడు.

ఇలాఉంటే పాకిస్థాన్ ప్లేయర్ సనా మీర్ జట్టు కూర్పుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆసియా కప్ కోసం జట్టులో భారీగా మార్పులు చేయడాన్ని ఆమె తప్పుబట్టింది. సనా మీర్ వ్యాఖ్యలపై స్పందించిన వహాబ్.. ఆమె అభిప్రాయంతో తనకు సంబంధంలేదని తేల్చిచెప్పాడు. సనా మీర్‌కు తన సొంత అభిప్రాయం ఉంది. ఆ అభిప్రాయంతో నాకు ఎలాంటి సంబంధం లేదు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే జట్టులో మార్పులు చేశాం. ఇంతకుముందు ఆడిన ప్లేయర్లు చాలా ప్రపంచకప్‌లు, ఆసియా కప్‌లు ఆడారు. అయినా ఆశించిన ఫలితాలు రాలేదు. అందుకే కొత్త ప్లేయర్లకు అవకాశం ఇచ్చి, రాబోయే టోర్నీలకోసం జట్టును నిర్మించాలని నిర్ణయించామని వహాబ్‌వివరించాడు.

# పాక్ క్రికెట్‌లో కలకలం.. ఆటగాళ్ల ఫోన్లు స్వాధీనం

పాకిస్థాన్ క్రికెటర్‌లో వివాదాలు రోజురోజుకూ ముదురుతున్నాయి. ఇంగ్లండ్‌తో జరగనున్న మూడో టెస్టుకు ముందు పాక్ క్రికెటర్ల ఫోన్లను పీసీబీ స్వాధీనం చేసుకున్నట్లు ఆ దేశ మీడియా వెల్లడించింది. ఆటగాళ్ల ఫోన్లను బోర్డు కస్టడీలోకి తీసుకున్నట్లు తెలిపింది. అయితే పీసీబీ అలా ఎందుకు చేయాల్సి వచ్చింది.. అసలు దేనిపై దర్యాప్తు జరుగుతోంది అనే విషయాలపై స్పష్టత లేదు. దీనిపై త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ అంశంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కూడా అధికారికంగా స్పందించలేదు. ఇంగ్లండ్-పాకిస్థాన్ టెస్టు సిరీస్‌లో ఇప్పటికే పాక్ క్రికెట్ బోర్డు పలు కీలక నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. తొలి రెండు టెస్టుల్లో పాకిస్థాన్ ఘోర ఓటమిని చవి చూసింది. దీంతో మూడో టెస్టుకు ముందు ఏకంగా ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించి స్వదేశానికి పంపింది. హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమల్ గుల్‌లపై కూడా వేటు వేసింది. వారి స్థానంలో కొత్త ప్లేయర్లను, కోచ్‌లను నియమించింది.





### ఫోన్ల వ్యవహారంపై ఉత్కంఠ

ఇప్పటికే జట్టు ఎంపిక, కోచింగ్ సిబ్బంది మార్పులు, ఆటగాళ్లపై వేటు వంటి వరుస పరిణామాలతో పాక్ క్రికెట్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆటగాళ్ల ఫోన్లను పీసీబీ స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తోందన్న వార్తలు మరింత కలకలం రేపుతున్నాయి. అసలు పాక్ క్రికెట్‌లో ఏం జరుగుతోందని సోషల్ మీడియాలో చర్చలు మొదలయ్యాయి. అయితే దర్యాప్తు ఏ అంశంపై జరుగుతోంది.. ఫోన్లను ఎందుకు స్వాధీనం చేసుకున్నారు.. అన్న ప్రశ్నలకు పీసీబీ అధికారికంగా సమాధానం ఇవ్వాల్సి ఉంది. మూడో టెస్టుకు ముందే ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

చైతన్య రథం
సినిమా
సోమవారం 7 సెప్టెంబరు 2026 X



## మైత్రీ మూవీ మేకర్స్ సినిమాతో
# బాలయ్య వారసుడు మోక్షజ్ఞ ఎంట్రీ!

నందమూరి నటసింహం బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ సినీరంగ ప్రవేశంపై స్పష్టత వచ్చింది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నందమూరి అభిమానుల కల నెరవేరింది. మోక్షజ్ఞ తొలి మూవీకి రంగం సిద్ధమైంది. ఈ మేరకు కొత్త సినిమా ప్రకటన వచ్చేసింది. మల్లిడి వశిష్ట దర్శకత్వంలో మోక్షజ్ఞ వెండితెరకు పరిచయం కాబోతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది. ఆదివారం మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని చిత్ర బృందం ప్రకటించింది. 'కూన గుహను వీడింది. సింహంలా అడవిలోకి అడుగు పెట్టింది. హ్యాపీబర్త్‌డే మోక్షజ్ఞ' అంటూ మైత్రీ మూవీ మేకర్స్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

# డిసెంబర్ 4న 'లెగసీ'!





విష్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'లెగసీ' విడుదల తేదీ ఖరారైంది. పొలిటికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. సాయికిరణ్ రెడ్డి దైదా దర్శకత్వంలో కలహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి, సాయి కిరణ్‌రెడ్డి దైదా నిర్మిస్తున్నారు. సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ మేకర్స్ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. విశ్వక్ సేన్, ఏక్తా రాథోడ్ కనిపిస్తున్న ఈ కొత్త పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 'పిండం' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన సాయికిరణ్‌రెడ్డి దైదా, 'లెగసీ'తో తన రెండో సినిమాను తెరకెక్కిస్తున్నారు.

పవర్‌ఫుల్ పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న 'లెగసీ'లో ఫ్యామిలీ, ప్రేమ, అధికారం, ద్రోహం, వంటి అంశాల మధ్య జరిగే ఆసక్తికర సంఘర్షణను ఆవిష్కరించనున్నారు. తన తండ్రి వదిలిన వారసత్వం కారణంగా ప్రమాదకరమైన ప్రపంచంలోకి అడుగుపెట్టిన ఓ యువకుడి ప్రయాణంలో విష్వక్ సేన్ పాత్ర సాగుతుంది. హిందీ నటుడు కే కే మీనన్ అత్యంత శక్తివంతమైన ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారు.

# రూ.100 కోట్ల క్లబ్‌లో 'హనుమాన్ అంశ్'



చిన్న సినిమాగా విడుదలై బాక్సాఫీసు వద్ద సంచలనాలు సృష్టిస్తున్న 'హనుమాన్ అంశ్' మరో మైలురాయికి చేరువైంది. ఆదివారంతో రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. శనివారం రూ.16.25 కోట్లు వసూళ్లు సాధించిన ఈ సినిమా, మొత్తంగా రూ.99.13 కోట్లు కలెక్ట్ చేసింది. ఆదివారం రూ.100 కోట్లు దాటేసింది. స్టార్లుగానీ, ప్రేక్షకులకు పరిచయమున్న నటులుగానీ లేని ఈ సినిమా, ఎలాంటి ప్రచారం లేకుండా చాలా సాదాసీదాగా విడుదలైంది. క్రమంగా పాజిటివ్ మౌత్ టాక్ సొంతం చేసుకోవడంతో వసూళ్లు పుంజుకున్నాయి. తొలి వారం రూ.1.08 కోట్లు, రెండో వారం రూ.40 లక్షలు మాత్రమే సాధించిన ఈ చిత్రం, ఆ తరువాతి నుంచి అనూహ్య రీతిలో దూసుకెళ్లింది. మూడో వారం రూ.10.40 కోట్లు, నాలుగో వారం రూ.61 కోట్లు, 29వ రోజు రూ.10 కోట్లు, 30వ రోజు రూ.16.25 కోట్లు రాబట్టింది. కేవలం రూ.2కోట్ల వ్యయంతో తెరకెక్కిన ఈ సినిమా 31 రోజుల్లోనే రూ.100 కోట్లు వసూలు చేస్తుండటం చూసి బాలీవుడ్ వర్గాలు ఆశ్చర్యపోతున్నాయి. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవిత చరిత్ర ఆధారంగా దర్శకుడు విశాల్ చతుర్వేది దీన్ని తెరకెక్కించారు.




# 'దాదా'గా బాలయ్య
## క్రిస్మస్ ముందు రోజు తెరపైకి

నటసింహం బాలకృష్ణ అభిమానులు చాలాకాలంగా ఎదురు చూస్తున్న అప్‌డేట్ వచ్చేసింది. అంతేకాకుండా ఊహాగానాలకు తెర దించుతూ ఫ్యాన్స్ ఎదురు చూపులకు ముగింపు పలికారు. ఆదివారం బాలయ్య కుమారుడు నందమూరి మోక్షజ్ఞ తేజ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్‌బీకే 111 నుంచి తాజా విశేషం విడుదల చేశారు. సినిమా టైటిల్ 'దాదా' అని అధికారికంగా ప్రకటించడంతో పాటు డిసెంబర్ 24న సినిమాను థియేటర్లకు తీసుకు వస్తున్నట్లు ప్రకటించారు.

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, మాస్ చిత్రాల దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రూపొందుతోన్న ఎన్‌బీకే 111పై భారీ అంచనాలు ఉన్నాయి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'వీరసింహారెడ్డి' బ్లాక్‌బస్టర్ విజయం సాధించడంతో, ఈ తాజా చిత్రంపై ప్రకటన వచ్చినప్పటి నుంచే అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఎక్కడా రాజీపడకుండా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

గతంలో బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'ఎంట్రీ ఆఫ్ ఆన్ ఎరా' ఫస్ట్ గ్లింప్స్‌లో బాలయ్య అల్ట్రా స్టైలిష్, పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించి మాస్ ప్రేక్షకులకు పూనకాలు తెప్పించారు. ఇక తాజాగా ఆదివారం విడుదల చేసిన గ్లింప్స్ స్టన్నింగ్‌గా ఉండి బాలయ్య నుంచి ఫ్యాన్స్ ఆశించే కోరుకునే అంశాలను అన్నింటినీ రంగరించి మరీ సినిమాను స్టైలిష్‌గా రూపొందిస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. నాకు గురి పెట్టాలంటే బుల్లెట్స్‌కు బలుపు ఉండాలి.. గన్స్‌కు గట్స్ ఉండాలి వంటి డైలాగులతో అదరగొట్టారు. కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తోన్న ఈ మూవీలో మంచు మనోజ్ ప్రతినాయకుడిగా నటిస్తుండడం విశేషం.

ఇటీవల ఇదే మూవీ షూటింగ్‌లో బాలకృష్ణ గాయపడిన సంగతి తెలిసిందే. గాయం కారణంగా ప్రస్తుతం విశ్రాంతిలో ఉన్న ఆయన త్వరలోనే తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. ముంబయి నేపథ్యంగా సాగే ఈ యాక్షన్ డ్రామాలో బాలకృష్ణ మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో అలరించనున్నారు.

# నిర్మాతల మండలి ఎన్నికల్లో 'మన ప్యానల్' ఘన విజయం

తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి 2026-28 కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు నిర్వహించిన ఎన్నికలు ముగిశాయి. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరగగా.. మొత్తం 1168 మంది సభ్యులకు గాను 643 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితాలను ప్రకటించారు. ఈ ఎన్నికల్లో 'మన ప్యానల్', 'ప్రోగ్రెసివ్ ప్యానల్' మధ్య గట్టి పోటీ నెలకొనగా కీలక పదవుల్లో 'మన ప్యానల్' ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్లుగా మోహన్ వడ్లపట్ల (మన ప్యానెల్), దామోదర్ ప్రసాద్ (ప్రోగ్రెసివ్ ప్యానెల్) ఎన్నికయ్యారు. ట్రెజరర్‌గా చదలవాడ శ్రీనివాసరావు (మన ప్యానెల్)ను ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రటరీలుగా అమ్మిరాజు, తుమ్మలపల్లి మన ప్యానెల్ నుంచి ఎన్నికయ్యారు. ఈసీ మెంబర్లుగా విజయం మన ప్యానెల్ నుంచి 12 మంది ఎంపిక కాగా.. ప్రోగ్రెసివ్ ప్యానెల్ ముగ్గురు ఎంపికయ్యారు. నిర్మాతల మండలి అధ్యక్షుడిగా మన ప్యానల్ నుంచి సీ కళ్యాణ్ ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈసీ సభ్యుల విషయంలోనూ 'మన ప్యానల్' భారీ ఆధిక్యం సాధించింది. ఆ ప్యానల్ నుంచి 12 మంది సభ్యులు విజయం సాధించారు. పద్మిని, ఏషియన్ సునీల్, మోహన్ గౌడ్, శివలెంక కృష్ణ ప్రసాద్, దానయ్య, వంశీ నందిపాటి, పల్లి కేశవ రావు, శ్రీనివాసరావు, పుల్లారావు, బాపి రాజు, ఆర్.కె. గౌడ్, నయీం ఈసీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఇక 'ప్రోగ్రెసివ్ ప్యానల్' నుంచి మైత్రీ రవి, నిరంజన్‌రెడ్డి, డీవీఎస్ రావు ఈసీ సభ్యులుగా గెలుపొందారు. అయితే జనరల్ సెక్రటరీ పదవికి సంబంధించిన కేసు ప్రస్తుతం కోర్టులో ఉండటంతో ఆ పదవిపై తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది.

### నిర్మాతలకు అండగా ఉంటాం: సి.కళ్యాణ్

ఎన్నికల అనంతరంనిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కళ్యాణ్ మాట్లాడుతూ... తమ ప్యానల్‌పై నమ్మకం ఉంచి గెలిపించిన నిర్మాతలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి సైతం ఎంతోమంది నిర్మాతలు హైదరాబాద్‌కు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. తమ ప్యానల్‌కు దాదాపు 95 శాతం మంది నిర్మాతల మద్దతు లభించడం తమపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని సి.కళ్యాణ్ పేర్కొన్నారు. తమను గెలిపించిన నిర్మాతలకు ఎప్పటికీ అండగా ఉంటా మని, వారికి ఎలాంటి లోటు రాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు.

చదలవాడ శ్రీనివాసరావు చేసిన సేవా కార్యక్రమాలు ఆయనకు ట్రెజరర్‌గా విజయం సాధించడంలో కీలకంగానిలిచాయని అన్నారు. ప్రస్తుతం చిన్న నిర్మాతలు సొంత డబ్బుతో సినిమాలు నిర్మించి.. వాటిని విడుదల చేసేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సి.కళ్యాణ్ తెలిపారు. చిన్న నిర్మాతల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకకార్యాచరణ రూపొందిస్తున్నామని, త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు. తనను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్ను కోవడంలో కీలకంగా సహకరించిన బండ్ల గణేష్‌కు ప్రత్యేకంగాధన్యవాదాలు తెలిపారు.

నిర్మాత ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. చదలవాడ శ్రీనివాసరావు నిర్మాతల మండలికి దూరంగా ఉన్న సమయంలోనూ నిర్మాతల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని అన్నారు. ఆయనను తామే ఒప్పించి ట్రెజరర్ పదవికి పోటీ చేయించామని, నిర్మాతలు భారీ మెజారిటీతో గెలిపించారని చెప్పారు. నిర్మాతల మండలి అభివృద్ధికి ఆటంకం కలిగించే వారిని ఉపేక్షించబోమని ప్రసన్నకుమార్ స్పష్టం చేశారు.

### ఎన్టీఆర్ ఆశీర్వాదాలు ఉన్నాయి: చదలవాడ శ్రీనివాసరావు

ట్రెజరర్‌గా విజయం సాధించిన చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ తనకు ఇంత భారీ మెజారిటీ రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన విజయానికి ఎన్టీఆర్ ఆశీర్వాదాలు ఉన్నాయని చెప్పారు. నందమూరి కుటుంబ సభ్యులంతా తనకు మద్దతుగా నిలవడం ఆనందంగా ఉందని తెలిపారు. నిర్మాతలందరూ ఏకమై తమ ప్యానల్‌ను భారీ స్థాయిలో గెలిపించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా చిన్న నిర్మాతల అభ్యున్నతి కోసం అన్ని విధాలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నిర్మాతల మండలి అభివృద్ధికి సి.కళ్యాణ్, ప్రసన్న కుమార్ ఎంతో కృషి చేశారని, ఇకపై కూడా వారి సేవలు మండలి అభివృద్ధికి ఉపయోగపడతాయని చెప్పారు. నిర్మాత సునీల్ నారంగ్ కూడా ఎంతో సహకరించారని పేర్కొన్నారు.

మొత్తంగా చూస్తే.. ఈ ఎన్నికల్లో 'మన ప్యానల్' కీలక పదవుల్లో ఆధిపత్యం సాధించడంతో కొత్త కార్యవర్గంపై నిర్మాతల్లో అంచనాలు పెరిగాయి. ముఖ్యంగా చిన్న నిర్మాతల సమస్యలు, సినిమాల విడుదలకు ఎదురవుతున్న ఇబ్బందులు, నిర్మాతల సంక్షేమం వంటి అంశాలపై నూతన కార్యవర్గం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

